



Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 279 | శుక్రవారం 24 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## మోడీ, షా తీరులో హిట్లర్ ముద్రలు

- హిందూత్వ వ్యూహంలో 'సర్' భాగస్వామి
- జట్టులో చేరిన రిఫరీలా సీఈసీ
- నియోజకవర్గాల పునర్విభజన ఓ రాజకీయ కుతంత్రం
- బెంగాల్‌లో లెఫ్ట్‌ఫ్రంట్ తన బలాన్ని ప్రదర్శిస్తుంది :
- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ



**కోల్‌కతా – సూర్య వాస్తవం:**

బీజేపీ ప్రణాళికలలో నియంత హిట్లర్ ముద్రలు కన్పిస్తున్నాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ వ్యాఖ్యానించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్నార్సీ)

- మిగతా 2లో..

### రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల మధ్య

## ఏకాభిప్రాయం మంచిదే..

- గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం సామరస్యంగా పరిష్కరించుకుంటే కావాల్సింది ఏముంటుంది : సుప్రీంకోర్టు
- కొత్త గవర్నర్‌కు కొంత సమయం కావాలని కోరిన అటార్నీ జనరల్
- అందుకు అనుమతిస్తూ... తదుపరి విచారణ జులై 22కి వాయిదా

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

"గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థలు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుంటామంటే అంతకంటే కావాల్సింది ఏముంటుంది" అని తెలంగాణ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామక కేసులో సర్వోన్నత న్యాయ స్థానం వ్యాఖ్యానించింది. ఈ విధంగా రాజ్యాంగ సంస్థలు ఏకాభిప్రాయా నికి వస్తే... కోర్టులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉండదని అభిప్రాయపడింది.



గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందని 2024, ఆగస్టు 4న దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

- మిగతా 2లో..



## వచ్చే నెలలో నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీ

- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ రాహుల్‌గాంధీతో భేటీ
- హైదరాబాద్‌లో ఏఐసీసీ ఓబీసీ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అహర్నిశలు శ్రమించిన ప్రతి ఒక్క కార్యకర్తకూ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఇందులో భాగంగానే టీపీసీసీ పూర్తి స్థాయి కార్యవర్గ నియామకంతో పాటు, వివిధ కార్పొరేషన్లు, బోర్డులకు సంబంధించిన నామినేటెడ్ పదవుల భర్తీపై అగ్రనేత రాహుల్ గాంధీతో విస్తృతంగా చర్చించినట్టు చెప్పారు. ఈ నియామకాల ప్రక్రియను వచ్చే నెలలో పూర్తి చేయాలని నిర్ణయించినట్టు స్పష్టం చేశారు. గురువారం నాడిక్కడ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్రంలో పార్టీ పరిస్థితులు, సంస్థాగత నిర్మాణం, ప్రభుత్వ పనితీరుతో పాటు కులగణన తదితర కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ దిశలో ప్రభుత్వానికి, పార్టీకి మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

**ఏఐసీసీ ఓబీసీ మీటింగ్ నిర్వహించండి**

బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# పోలింగ్ ప్రశాంతం

- తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్
- బెంగాల్‌లో ఘర్షణలు.. పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తం
- ఓటేసిన సినీతారలు, ప్రముఖులు



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

తమిళనాడు, పశ్చిమబెంగాల్(తొలివిడత) అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. గతంతో పోల్చితే పశ్చిమబెంగాల్‌లో 91.35 శాతం నమోదైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదైంది. చెన్నైలో 84.29 శాతం పోలింగ్ నమోదు కాగా బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పూర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్టు వెల్ల డించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా..

- మిగతా 2లో..

## బెంగాల్ ఎన్నికలు.. ముర్షిదాబాద్‌లో ఉద్రిక్తత

**హైదరాబాద్ – సూర్య వాస్తవం**

బెంగాల్ తొలి విడత పోలింగ్‌లో ఘర్షణ నెలకొంది. ముర్షిదాబాద్‌లో పోలింగ్ ఎదుట టీఎంసీ,

- మిగతా 2లో..



## ప్రతి ఇంటికి సోలార్

- త్వరలో 40 లక్షల ఇళ్లకు రూఫ్‌టాప్ అనకాపల్లికి 'సుజల స్రవంతి'
- 6.5 గిగావాట్ల రెన్యూ సోలార్ ఇన్‌గాట్-వేఫర్ ప్లాంటుకు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు




**అనకాపల్లి – సూర్య వాస్తవం**

రాష్ట్రంలో ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్‌ను అందచేయడం తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 6.5 గిగావాట్ల రెన్యూ సోలార్ ఇన్‌గాట్-వేఫర్ ప్లాంట్‌కు గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీనిలో బాగంగా రానున్న రోజుల్లో 40 లక్షల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు నెలకొల్ప నున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిపైనా

- మిగతా 2లో..




## నేడు 62 మండలాల్లో తీవ్ర వడగాలులు

**- విపత్తుల నిర్వహణ సంస్థ**

**అమరావతి – సూర్య వాస్తవం**

రాష్ట్రంలో ఎండ తీవ్రత రోజు రోజుకీ పెరుగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఇదే పరిస్థితి కొనసాగనున్నందున ప్రజలు తీవ్ర ఎండ, ఉక్కపోత, వడగాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ సూచించారు. శుక్రవారంనాడు రాష్ట్రంలోని 62 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 89 మండలాల్లో సాధారణ వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- మిగతా 2లో..



### తెలంగాణ రాష్ట్ర పండుగగా

## వాసవీ మాత జయంతి...

- ఉత్తర్వులు జారీ - ఏటా వైశాఖ శుక్ల దశమి నాడు అధికారికంగా ఉత్సవాలు
- ఈ ఏడాది ఏప్రిల్ 26న జయంతి వేడుకలు నిర్వహణ
- అన్ని జిల్లాల్లో వేడుకలు జరపాలని కలెక్టర్లకు ఆదేశాలు
- పర్యాటక, సాంస్కృతిక శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించిన సర్కార్

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించింది. ఇకపై ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లాంఛనాలతో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న వాసవీ జయంతి రానుండటంతో, ఆ రోజున ఉత్సవాలు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు

- మిగతా 2లో..

# వచ్చే నెలలో నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

ఎదుగుదలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, ఏ దశలోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. రాబోయే ఏఐసీసీ నేషనల్ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. బీసీల సాధికారత పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని దేశవ్యాప్తంగా చాటేలా ఈ మీటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు అగ్రనేతకు తెలిపారు. అలాగే తెలంగాణ వేదికగా బీసీ ఐక్యతకు మరింత మద్దతు కూడగట్టేందుకు ఈ సమావేశం దోహదపడుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ల కోటాలో కోటా అంశాన్ని జోడించాలని తద్వారా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించాలని రాహుల్‌ని కోరినట్టు తెలిపారు.

శాస్త్రీయంగా కుల గణన బీఆర్ఎస్ సర్కార్ హయాంలో చేసిన ఒక్క రోజు సర్వే కాదని మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత శాస్త్రీయంగా కుల గణన చేసిందన్నారు. ఈ సర్వే ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి లోపం జరగలేదన్నారు. అత్యంత శాస్త్రీయ పద్ధతిలో స్పష్టమైన వివరాలు నమోదు చేసినట్టు తెలిపారు. ఎన్యుమరేటర్లు నేరుగా ప్రజల ఇండ్ల వద్దకు వెళ్లి, క్షుణ్ణంగా వివరాలు సేకరించారని గుర్తు చేశారు. ఈ వాస్తవ డేటా ఆధారంగానే భవిష్యత్తులో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అవసరమైన విధానాలను రూపొందిస్తామన్నారు. తద్వారా సమాజంలో ప్రతి వర్గానికి సామాజిక న్యాయం దక్కాలన్న రాహుల్ గాంధీ ఆశయాన్ని తెలంగాణలో వంద శాతం అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు.

**రాహుల్‌తో అనిల్‌కుమార్ భేటీ**

అంతకు ముందుకు రాహుల్ గాంధీని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశమంతటా 'తెలంగాణ' నమూనా అమలు చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణలో ప్రభుత్వం కుల గణనను అత్యంత విజయవంతంగా, శాస్త్రీయంగా పూర్తి చేసిందన్నారు. రాష్ట్రంలోని సామాజిక నిష్పత్తిని బహిర్గతం చేయడంలో ప్రభుత్వం సఫలమైందని, ఇదే 'తెలంగాణ మోడల్'ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని రాహుల్‌ను కోరినట్టు తెలిపారు. ప్రస్తుతం కేంద్రం చేపడుతున్న జనగణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు మాజీ ఎంపీ వీహెచ్ సైతం రాహుల్‌గాంధీని కలిశారు.

# ప్రతి ఇంటికి సోలార్

(మొదటిపేజీ తరువాయి)

విద్యుదుత్పత్తి కోసం రూ.82 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేందుకు రెన్యూ సంస్థ సుముఖత వ్యక్తం చేసిందని చెప్పారు. అందులో భాగంగా రాంబిల్లిలో రూ.5,200 కోట్లతో 6.5 గిగావాట్ల సోలార్ ప్లాంట్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని, ఈ రంగంలో ఈ జిల్లా భారత్‌లోనే అగ్రస్థానానికి చేరే అవకాశం ఉందని అన్నారు. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి వెనుకబడిన ప్రాంతం అని, తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ జిల్లాను సంపద కలిగిన ప్రాంతంగా మార్చానని చెప్పారు. అనకాపల్లి మరో రంగారెడ్డి జిల్లాగా తయారవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర మాజీ మంత్రి, కీర్తిశేషులు యశ్వంత్ సిన్హా కుమారుడు ఈ సోలార్ వేఫర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రాన్ని ఎంచుకోవడం హర్షణీయమన్నారు. అభివృద్ధి సూచికల్లో విద్యుత్ వినియోగం ఓ భాగమని, ఎంత విద్యుత్ వినియోగిస్తే అంత అభివృద్ధి సాధించినట్టే నన్నారు. అందుకే రాష్ట్రంలో విద్యుదుత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని పేర్కొన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుదుత్పత్తి జరుగుతోందని, రాంబిల్లిలో సౌర ఫలకాలు తయార వుతాయని వివరించారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకు న్నామని, రూ.5.95 లక్షల కోట్లు ఈ రంగంలో పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. 90 గిగావాట్ల మేర ప్రతిపాదనలు, ఎంఒయులు సిద్ధమయ్యాయన్నారు. ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోందని, ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ నెల 28న 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఎఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగనుందని, జులైలో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని, లారస్ ల్యాబ్ రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తోందని తెలిపారు. విశాఖ రాజమహేంద్రవరం మధ్య నాలుగు రైల్వే లైన్లు కార్గో, స్పీడ్ రైల్ కారిడార్ వస్తోందన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి సుజల స్రవంతి జలాలను అనకాపల్లి జిల్లాకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రెన్యూ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, సిఇఒ సుమంత్ సిన్హా మాట్లాడుతూ తాము నెల కొల్పబోయే ఈ ప్రాజెక్టులో సుమారు 2,100 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సిబ్బందికి నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపి సిఎం రమేష్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యేలు సుందరపు విజరుకుమార్, కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కెఎస్ఎన్ఎస్.రాజు, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పండుగగా

# వాసవీ మాత జయంతి...

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం G.O. Ms. No. 67ను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వాసవీ మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖకు నోడల్ ఏజెన్సీగా అప్పగించారు. వేడుకలకు అవసరమైన నిధులను ఆ శాఖ బడ్జెట్ నుంచే కేటాయించాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వాసవీ మాత జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జరగనున్నాయి.

# నేడు 62 మండలాల్లో తీవ్ర వడగాలులు

(మొదటిపేజీ తరువాయి)

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎక్కువ మండలాలు తీవ్ర వడగాల్పుల ప్రభావంలో ఉండనున్నాయి. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్ని మండలాల్లో కూడా తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

# పోలింగ్ ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

అప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు.
తమిళనాడులో 234 స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభమైన ప్పటికీ ఓటర్లు ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్ తన కుటుంబసభ్యులతో వచ్చి ఓటు వేశారు. సినీతారలు, ప్రముఖ రాజకీయ నాయకులు రజనీకాంత్, కమల్‌హాసన్, టీవీకే అధినేత విజరు తదితరులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

**పశ్చిమబెంగాల్‌లో అక్కడక్కడ ఉద్రిక్తతలు**

పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ఉద్రిక్తత, అశాంతి నెలకొన్నట్టు వార్తలు వచ్చాయి.

ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలకు, ఏయూజేపీ వ్యవస్థాపకుడు హుమాయున్ కబీర్‌కు మధ్య ఘర్షణ జరిగింది.సిలిగురిలో టీఎంసీ, బీజేపీ కార్య కర్తల మధ్య వేర్వేరు ఘర్ష ణలు జరిగినట్టు సమా చారం. కుమార్ గంజ్‌లో తన పోలింగ్ ఏజెంట్లను పలు బూత్‌ల నుంచి తొల గించారని బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్ ఆరోపిం చారు.తనపై దాడి జరిగిం దనీ ఆయన పేర్కొన్నారు.

## బెంగాల్ ఎన్నికలు.. ముర్షిదాబాద్‌లో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

మాజీ తృణమూల్ నాయకుడు, ప్రస్తుతం ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ (ఏయూజేపీ) వ్యవస్థాపకుడైన కబీర్ హుమాయున్ కబీర్‌కు మధ్య గొడవ జరిగింది. ఓటర్లను ప్రలోభపెడుతున్నారని ఇరువర్గాల అనుచరులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు హుమాయున్ కబీర్‌ను పోలింగ్ పరిసర ప్రాంతాల నుంచి పంపించారు. కాగా, ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్‌లో ప్రజలు ఉత్సహంగా పాల్గొంటున్నారు. ఉదయం 9గంటలకు పోలింగ్ శాతం 18పైగా నమోదు అయింది. మొదటి దశలో రాష్ట్రంలోని 294 స్థానాలకు గాను 152 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. ఇందులో ఉత్తర బెంగాల్‌లోని ఎనిమిది జిల్లాల్లోని 54 స్థానాలతో పాటు ముర్షిదాబాద్, నాడియా, బీర్భూమ్, హుగ్లీ జిల్లా ల్లోని పలు స్థానాలు ఉన్నాయి. రెండో దశ ఎన్నికలు ఏప్రిల్ 29న జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# మోడీ, షా తీరులో హిట్లర్ ముద్రలు

(మొదటిపేజీ తరువాయి)

యత్నాలనుఆయన నాజీ జర్మనీతో పోల్చారు. ఫాసిస్టు, మెజారిటీవాద హిందూత్వ దేశాన్ని ఏర్పాటు చేసేందుకు సీఏఏ, ఎన్నార్సీ, జనగణన ప్రక్రియ, ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (సర్), నియోజకవర్గాల పునర్విభజనలను ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉపయోగించుకుంటున్న తీరులో హిట్లర్ నేతృత్వంలోని జర్మనీ ముద్రలు కన్పిస్తున్నా యని ఆయన విమర్శించారు. కోల్‌కతాలోని ముజఫర్ అహ్మద్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బేబీ మాట్లాడుతూ 'ఇది మనకు జర్మనీని గుర్తు చేస్తోంది. 1935వ సంవత్సరం సెప్టెంబరులో న్యూరెంబర్గ్ చట్టా లను తీసుకొచ్చారు. వాటి ఉద్దేశమేమిటి? ఆర్యుల జాతి స్వచ్ఛతను పరిరక్షించే పేరుతో ఇతరులను... ముఖ్యంగా యూదులను పౌరులు కానివారుగా ప్రకటించారు. ఆ తర్వాత ఏం జరిగిందో మనకందరికీ తెలుసు. 1933లో హిట్లర్ అధికారంలోకి వచ్చారు. 1935లో న్యూరెంబర్గ్ చట్టాలు అమలులోకి వచ్చాయి. మోడీ, అమిత్ షా ఇప్పుడు చేస్తున్నది హిట్లర్ నాటి జర్మనీకి నకలు వంటిదే' అని వివరించారు.

నియోజకవర్గాల పునర్విభజన ద్వారా బీజేపీ తమకు అనుకూలంగా, ప్రత్యర్థులకు నష్టం కలిగేలా వాటి సరి హద్దులను అశాస్త్రీయంగా మార్చాలని చూస్తోందని, ఇది ఒక రాజకీయ కుతంత్రమని చెప్పారు. కేంద్రంలో అధికా రంలో ఉన్న పార్టీ ఇప్పటికే జమ్మూకాశ్మీర్, అస్సాంలలో దీనిని పాక్షికంగా అమలు చేస్తోందని తెలిపారు. ఇప్పుడు దేశమంతటా అమలు చేయాలని చూస్తోందని అన్నారు. 'తనకున్న భారీమెజారిటీని ఉపయోగించుకొని తనకు న చ్చిన విధంగా హిందూ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకోవాల న్నది బీజేపీ ప్రణాళిక. లోక్‌సభ సీట్లసంఖ్య 850కి పెంచా లనుకోవడం వెనుకున్న ఎత్తుగడఇదే'అని ఆరోపించారు.

**మోడీ కుతంత్రాలలో జ్ఞానేశ్ భాగస్వామి**

మోడీ కుతంత్రాలలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ భాగమయ్యారని బేబీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ తటస్థ రాజ్యాంగ సంస్థ అధిపతి మాదిరిగా కాకుండా జట్టులో చేరిన రిఫరీలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'కేంద్రంలోని అధికార పార్టీకి మద్దతుగా జ్ఞానేశ్ కుమార్ తన పదవిని వినియోగిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఇది స్పష్టంగా కన్పిస్తోంది. ఇతర రాష్ట్రాలలో మాదిరిగా కాకుండా ఇక్కడ ఇక్కడ ఓ ప్రత్యేక వర్గంపై అనుమానాలు వ్యక్తం కావడం పట్ల సుప్రీంకోర్టు సైతం ఆశ్చర్యం వెలిబుచ్చింది. ఇతర రాష్ట్రాలలో లేని విధం గా బెంగాల్‌లో ఇది అసాధారణమైన, కలవర పాటు కు గురిచేసే, భయాందోళనలు కలిగించే పరిస్థితి' అని అన్నారు. మోడీ, అమిత్‌షా, అసోం సీఎం హిమంత బిశ్వశర్మ విద్వేష పూరిత ప్రసంగాలపై ఎన్నికల సంఘం మౌనం వహించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**విశ్వసనీయత కోల్పోతున్న బీజేపీ, టీఎంసీ**

బీజేపీ, టీఎంసీ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతున్నా యని బేబీ విమర్శించారు. బీజేపీ ప్రాజెక్టు ప్రజల్లో క్రమంగా విశ్వసనీయతను కోల్పోతోందని చెప్పారు. పెరుగుతున్న నిరుద్యోగం, తగ్గిపోతున్న ఉద్యోగ అవకాశాలు, గత రెండేళ్లలో దాదాపు ఎనిమిది లక్షలమంది బడి మానేయడం, మహిళలపై అసమానంగా ప్రభావం చూపేలా భారం మోపేలా పన్నులు విధించడం, సాధారణ విషయాల కోసం కూడా ప్రజలను పార్టీ కార్యాలయాలను ఆశ్రయించేలా బలవంతం చేసే పద్ధతి వంటివి పశ్చిమ బెంగాల్‌లో ప్రజాగ్రహాన్ని మరింత పెంచాయని తెలిపారు. టీఎంసీ తన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైందని చెప్పారు. ఉపాధ్యాయుల నియామకాల్లో భారీ అవినీతి ఆరోపణలు, రేషన్ పంపిణీ పేరుతో దోపిడీ, వాగ్దానాలకు, ఆచరణకు మధ్య నిరంతరం అంతరం కొనసాగడం వంటివి దాని విశ్వసనీయతను దెబ్బతీశాయని చెప్పారు.

**లెఫ్ట్‌ఫ్రంట్ బలాన్ని ప్రదర్శిస్తుంది**

విమర్శకులు ఆశ్చర్యపోయేలా మంచి విజయాన్ని లెఫ్ట్‌ఫ్రంట్ సాధిస్తుందని బేబీ అన్నారు. అసెంబ్లీలో గణనీయమైన ఉనికిని కలిగి ఉంటుందని, తన బలాన్ని ప్రదర్శిస్తుందని తెలిపారు. బీజేపీ, టీఎంసీ కూటముల వైఫల్యాల నడుమ పశ్చిమ బెంగాల్ సామాజిక, ఆర్థిక రంగంలో లెఫ్ట్‌ఫ్రంట్ పునరావిర్భావం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంటుందని ఆయన తెలిపారు. టీఎంసీకి వెలుపల ఉన్న పార్టీలతోసహా ప్రతిపక్ష శక్తుల మధ్య విస్తృత ఐక్యతను పెంపొందించడం ద్వారా విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాన్ని అందించేందుకు లెఫ్ట్‌ఫ్రంట్ కృషి చేస్తోందని ఆయన తెలిపారు. బెంగాల్‌లో లెఫ్ట్‌ఫ్రంట్ పునరుజ్జీవనాన్ని సాధిస్తుందన్న నమ్మకంతోపాటు ప్రత్యామ్నాయ పాలనా నమూనాను ముందుకు తీసుకెళ్తున్న కేరళ నుంచి ప్రజలు నిరంతరం స్ఫూర్తి పొందుతున్నారని బేబీ తెలిపారు. కేరళలో వరుసగా మూడోసారి చారిత్రాత్మక విజయాన్ని సాధించే స్థితిలో ఎల్‌డీఎఫ్ పటిష్టంగా ఉందని చెప్పారు. మీడియా సమావేశంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు సమీక్ లహిరి పాల్గొన్నారు.

**బెంగాల్ ఎన్నికలు అసాధారణం**

బెంగాల్‌లో నిర్వహిస్తున్న ఎన్నికలు స్వతంత్ర భారత చరిత్రలోనే అసాధారణమైనవని బేబీ అన్నారు. ఒక సమాజానికి చెందిన వారిని లక్ష్యంగా చేసుకొని ఓటు హక్కు వినియోగించు కోకుండా చేయడానికి హిందూత్వ ఎత్తుగడలో సర్ భాగస్వామి అయిందని విమర్శించారు. 'మారుమూల ప్రాంతాలకు చెందిన పేద ప్రజలకు ఓటు హక్కు విలువ తెలుసు.

అందుకే వారు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి నిలబడతారు. ఓటర్ల హక్కులు, పౌరసత్వం విషయంలో మోడీ, ఆయన బృందం చర్యలను సీఏఏ, ఎన్నార్సీ, జనాభా లెక్కల ప్రక్రియ, సర్ నేపథ్యంలో చూడాల్సి ఉంది. ఇది ఓటర్ల జాబితాల నుంచి ప్రత్యేక విస్తృత తొలగింపు (సర్) తప్ప మరేమీ కాదు' అని బేబీ అన్నారు.

## రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల మధ్య

# ఏకాభిప్రాయం మంచిదే..

(మొదటిపేజీ తరువాయి)

తమ నియామకాన్ని పక్కనపెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని వారు సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విజరు బిష్ణోరులతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. గవర్నర్ కార్యాలయం తరఫున అటార్నీ జనరల్ వెంకటరమణి హాజరై వాదనలు వినిపించారు. తెలంగాణకు కొత్త గవర్నర్ బాధ్యతలు స్వీకరించారని కోర్టుకు తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం పంపిన పంపిన కొత్త ఎమ్మెల్సీల (కోదండరాం, అజారుద్దీన్) సిఫారసులకు సంబంధించి ఈ నెల 31తో ఆరు నెలల గడువు ముగు స్తుందని వివరించారు. ఈ పరిస్థితుల్లో కొత్త గవర్నర్ సంబంధిత అంశంపై ఒక స్పష్ట మైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వ్యక్తు లకు ఇలాంటి వ్యవహారాల్లో నిర్ణయం తీసుకోవడానికి తగిన వెసులుబాటు ఇవ్వాల్సిన అవసరముందన్నారు.అందువల్ల గవర్నర్‌కు కొంతసమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

**పూర్తి అవకాశం ఇస్తున్నాం....**

అటార్నీ జనరల్ అభ్యర్థనను పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కొత్త గవర్నర్ ప్రభుత్వ సిఫారసులను స్వయంగా పరిశీలించి, వాస్తవిక ఆధారాలతో ఒక నిర్ణయం తీసుకునేందుకు పూర్తి అవకాశం ఇస్తున్నట్టు స్పష్టంచేసింది. గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం వంటి రాజ్యాంగ సంస్థలు సామరస్యంగా పరిష్కరించుకుంటామంటే, అంతకంటే కావాల్సింది ఇంకేముంటుంది అని జస్టిస్ విక్రమ్‌నాథ్ కామెంట్ చేశారు. ఆయన నవ్వుతూ చేసిన ఈ వ్యాఖ్యలతో కోర్టు రూం నవ్వులతో నిండిపోయి... ఆహ్లాదకరంగా మారింది. "రాజ్యాంగబద్ధ వ్యవస్థలైన ప్రభు త్వం, గవర్నర్ ఈ విషయంపై ఒకే అభిప్రాయానికి వచ్చి పరిష్కరించుకుంటే మంచి దే. ఇలాంటి పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉండదు" అని అన్నారు. అలాగే, గవర్నర్ కార్యాలయ విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం... తదుపరి విచారణను జులై 22వ తేదీకి వాయిదా వేసింది.


**ఇంకా పెండింగ్ లోనే కోదండ రాం, అజారుద్దీన్ నియామకాలు...**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ ఆనాటి రాష్ట్ర మంత్రి వర్గం గవర్నర్‌కు సిఫారసు చేసింది. రాజకీయ నేపథ్యం ఉందని చెబుతూ ఆ ఇద్దరి పేర్లను అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని ఇద్దరూ వేర్వేరుగా హై కోర్టులో సవాల్ చేశారు. హైకోర్టులో కేసు నడుస్తుండగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చింది. గతేడాది జనవరి 13న కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రివర్గం సిఫారసు చేసింది. దీనికి గవ ర్నర్ ఆమోదం తెలిపారు. అయితే, హైకోర్టులో కేసు విచారణ దశలో ఉండ గా తమ కోటాలో మరో ఇద్దరిని ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని శ్రవణ్ కుమార్, సత్యనారా యణ మరోసారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాలకు చెందిన సుదీర్ఘ వాదనల తర్వాత 2024, మార్చి 17న హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పు వెలువరిం చింది. శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణల నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు తీర్పులో వెల్లడించింది. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఆ తర్వాత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అజారుద్దీన్ పేర్లను రాష్ట్ర మంత్రివర్గం మరోసారి సిఫారసు చేయగా, ప్రస్తుతం అవి గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

# సంపాదకీయం

## స్తంభించిన న్యాయవ్యవస్థ

### - 5.58 కోట్ల కేసులు, న్యాయానికి శతాబ్దాల దూరం






**ఐఎన్ఏఎం నివేదిక:** కేసు ఫైళ్లలో కూరుకుపోయిన సామాన్యుడి జీవితం, పొదుపు, ఆశలు, సింగపూర్ నమూనాను అనుసరించాలన్న డిమాండ్. ఐఎన్ఏఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అబ్దుల్ అలీ జుబేర్.

**వరంగల్ -సూర్య వాస్తవం:** భారతదేశంలో న్యాయవ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉంది. ఏప్రిల్ 2026లో ఇండియన్ నేషనలిస్ట్ మూవ్‌మెంట్ విడుదల చేసిన ఒక నివేదిక, న్యాయవ్యవస్థపై ఉన్న భారం యొక్క భయంకరమైన చిత్రాన్ని ఆవిష్కరించింది. దేశవ్యాప్తంగా ఉన్న కోర్టులలో 5.58 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదని, కోట్లాది మంది భారతీయుల బాధ అని ఆ నివేదిక పేర్కొంది. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ ప్రకారం, దిగువ కోర్టులలో 4.89 కోట్ల కేసులు, హైకోర్టులలో 63.94 లక్షల కేసులు, సుప్రీంకోర్టులో 93 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా కోర్టులలో 69 శాతం కేసులు, హైకోర్టులలో 76 శాతం కేసులు ఏడాదికి పైగా పాతవి. వేలాది కేసులు 30 సంవత్సరాల కంటే పాతవి.

**సామాన్యుడి నాశనానికి గణాంకాలు:**

నిపుణుల ప్రకారం, న్యాయపరమైన జాప్యం కారణంగా భారతదేశం ప్రతి సంవత్సరం తన జీడీపీ 1.5% నష్టపోతుంది. కానీ దీని అసలు మూల్యం పేదవాడి కన్నీళ్లే. రైతు, కూలీ, చిన్న దుకాణదారుడు తన పొదుపు మొత్తాన్ని లాయర్లకు, ఫీజులకు, ప్రయాణానికి, లంచాలకు ఖర్చు చేస్తాడు. కేసు 10, 20, 30 సంవత్సరాల పాటు కొనసాగుతుంది. తీర్పు వచ్చేసరికి, వాది వృద్ధుడైపోతాడు, దివాలా తీస్తాడు లేదా మరణిస్తాడు.

**హృదయ విదారక ఉదాహరణలు:**

1. సుపన్ నర్సింగ్ గైక్వాడ్, మహారాష్ట్ర: 1968లో భూమి కొన్నారు. బ్యాంకు వివాదంలో 53 సంవత్సరాలు కేసు పోరాడారు. సుప్రీంకోర్టులో విచారణ రోజునే 108 ఏళ్ల వయసులో మరణించారు.
2. విష్ణు తివారీ, లలిత్‌పూర్: ఒక తప్పుడు కేసులో 20 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. 2021లో, అలహాబాద్ హైకోర్టు అతడిని నిర్దోషిగా ప్రకటించింది. అప్పటికే అతని ఉద్యోగం, ఆరోగ్యం, కుటుంబం అన్నీ నాశనమయ్యాయి.
3. కాన్పూర్ వితంతువు: పేరులోని × ,జు అక్షరాల పొరపాటు కారణంగా పెన్షన్ 45 సంవత్సరాలు ఆలస్యమైంది. లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ పేదరికం, మానసిక వేదన.

సంక్షోభానికి అసలు కారణాలు: 1. న్యాయమూర్తుల తీవ్ర కొరత: ప్రతి 10 లక్షల జనాభాకు 50 మంది న్యాయమూర్తులు అవసరం కాగా, కేవలం 21 మందే ఉన్నారు. వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

2. కొత్త కేసుల వెల్లువ: ప్రతి సంవత్సరం 2 నుంచి 3 కోట్ల కొత్త కేసులు నమోదవుతున్నాయి, వీటిలో సగం కేసులు ప్రభుత్వమే దాఖలు చేస్తున్నవి.

3. అంతులేని తేదీలు: పాత చట్టాలు, పేలవమైన మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం.

4. బూటకపు కేసులు: ఎప్పటికీ ముగియని ప్రభుత్వ అప్పీళ్లు.

**నిపుణుల హెచ్చరిక:**

న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉండటమే జాప్యానికి అతిపెద్ద కారణమని మాజీ జస్టిస్ అభయ్ ఓకా అన్నారు. 4 కోట్లకు పైగా కేసులు వ్యవస్థ వైఫల్యమని మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ అభివర్ణించారు.

**ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుంది?**

ఇదే వేగంతో కొనసాగితే, ఒక్క కొత్త కేసు కూడా రాకపోయినా, పేరుకుపోయిన కేసులన్నింటినీ పరిష్కరించడానికి 300 సంవత్సరాలకు పైగా పడుతుంది. సుప్రీంకోర్టు తన 93,000 కేసులను పరిష్కరించడానికి 1.4 సంవత్సరాల సమయం తీసుకుంటుంది.

**ప్రపంచం నుండి పాఠాలు -- పరిష్కారం ఏమిటి?**

సింగపూర్: కఠినమైన కేసుల నిర్వహణ, మొదటి రోజు నుండే న్యాయమూర్తి కాలపరిమితిని నిర్దేశిస్తారు. సమయం వృధా చేసినందుకు కోర్టు ఫీజులు పెరుగుతాయి. నేడు, 80 శాతం విచారణలు ఒక్క రోజులోనే ముగుస్తున్నాయి. జర్మనీ మరియు యూకే: డిజిటల్ ఫైలింగ్, ఆర్బిట్రేషన్ మరియు మధ్యవర్తిత్వం కారణంగా చిన్న కేసులు విచారణ వరకు రావడం లేదు.

**ఇనామ్ యొక్క 5 డిమాండ్లు:**

1. అన్ని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి. న్యాయమూర్తుల సంఖ్యను రెట్టింపు చేయాలి.
2. సింగపూర్ తరహా కేసుల నిర్వహణ వ్యవస్థను ప్రవేశపెట్టాలి.
3. సాంకేతికత, ఇ-ఫైలింగ్ మరియు ఏఐ (ూ×) వినియోగాన్ని పెంచాలి.
4. ప్రభుత్వం అనవసరమైన కేసులను ఉపసంహరించుకోవాలి. మధ్యవర్తిత్వాన్ని తప్పనిసరి చేయాలి.
5. కోర్టుల బడ్జెట్‌ను పెంచాలి మరియు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి.

ఇనామ్ జాతీయ ప్రధాన కార్యదర్శి జుబేర్ ముహమ్మద్: బి"సామాన్యుడు తన రక్తం, చెమటతో ఈ దేశాన్ని నిర్మించాడు. అతనికి 300 ఏళ్ల తర్వాత కాదు, ఈరోజే న్యాయం కావాలి. ఇకపై కోర్టుల ప్రాంగణాల్లో కన్నీళ్లు వద్దు. జై హింద్!"

# భారీ ప్రక్షాళనకు రేవంత్ ప్లాన్



**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

రాష్ట్ర పాలనా యంత్రాంగంలో తన మార్క్‌తో భారీ ప్రక్షాళనకు ప్లాన్ చేస్తున్నారట సీఎం రేవంత్ రెడ్డి. సెక్రటేరియట్ నుంచి జిల్లా కలెక్టరేట్ దాకా ఐఏఎస్ ట్రాన్స్‌ఫర్లలో ఉన్న అన్ని చిక్కులకు చెక్ పెట్టే స్కెచ్ వేస్తున్నారట. అడ్మినిస్ట్రేటివ్ రీషఫ్లింగ్‌కు రెడీ అవుతున్నారట. రేవంత్ సరికొత్త కసరత్తు వెనుక మాస్టర్ ప్లాన్ ఏంటి?అధికార యంత్రాంగంలో మార్పులు, చేర్పులపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్. ఇందులో భాగంగా త్వరలోనే భారీగా ఐఏఎస్ ల బదిలీలు చేయబోతున్నారట. ఈసారి ట్రాన్స్‌ఫర్స్ కసరత్తు.. ఇప్పటివరకు ఒక లెక్క..ఇక నుంచి మరో లెక్క అన్నట్లు నడుస్తోందట. రెండున్నరేళ్ల కాలంలో ఐదారుసార్లు ఐఏఎస్‌ల బదిలీలు చేసింది రేవంత్ సర్కార్. ఒక్కోసారి.. పదుల సంఖ్యలో టాన్స్‌ఫర్లు చేసిన సందర్భాలున్నాయి. జిల్లా కలెక్టర్ల నుంచి మొదలుకుని..సెక్రటేరియట్‌లో ప్రిన్సిపల్, స్పెషల్ సెక్రటరీల వరకు..అందరికీ స్థానం చలనం కల్పించింది. అయితే..ఈ బదిలీల్లో జరిగిన చిన్న తప్పిదాలు? కింది స్థాయి అధికారుల నుంచి..పై స్థాయి అధికారుల వరకు..క్లాషెస్‌కు దారితీసింది.సీనియర్ వర్సెస్ జూనియర్ కోల్డ్ వార్ ఇష్యూ అయింది. గ్రేటరక్ కమిషనర్‌గా ఓ అధికారికి పోస్టింగ్ ఇచ్చిన సర్కార్..ఆయన కింద జోనల్ కమిషనర్‌గా..ఓ సీనియర్ ఐఏఎస్ ఉన్న విషయాన్ని కూడా గుర్తించలేకపోయిందట. దీంతో నొచ్చుకున్న సదరు సీనియర్ ఐఏఎస్ ఇగో హర్ట్ కావడంతో లాంగ్ లీవ్‌లో వెళ్లిపోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది.అధికారుల్లో..తాము వేరయా అన్నట్లు..ఐఏఎస్ అధికారులు భావిస్తుంటారు.. వ్యవహరిస్తుంటారు కూడా. ఇలా కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు.. ఐఏఎస్‌ల మధ్య కూడా..గతంలో డిసిగ్నేషన్ పంచాయితీతో ఇగో క్లాషెస్ వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఈ మధ్య కన్ఫర్డ్ ఐఏఎస్‌లలో ఒకరికి స్పెషల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇవ్వగా..ఆయనకంటే సీనియర్ ఐఏఎస్ సెక్రటరీగా ఉన్న సందర్భం ఎదురైంది. దీంతో సదరు ఐఏఎస్..వాట్ ఈజ్ దిస్ అంటూ బాగా ఫీల్ కావడంతో..అప్పటికప్పుడు సెక్రటరీని స్పెషల్ సెక్రటరీగా మార్చారట.ఇక టూరిజం శాఖలో అయితే ఇప్పటివరకు అరడజన్ మంది సెక్రటరీలు రావడం..పోవడం ఓ తంతుగా మారిపోయిందట. ఇక ఎన్నిసార్లు బదిలీలు జరిగినా.. హెల్త్ సెక్రటరీ సహా మరికొందరికి ఎందుకోగానీ స్థాన చలనం లేదనే టాక్ సెక్రటేరియట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇలా..ఒక్కోచోట..ఒక్కో రకంగా..ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్లలో జరుగుతున్న పొరపాట్లను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి..వీటన్నింటికి చెక్ పెట్టాలని భావిస్తున్నారట. మరోవైపు తెలంగాణ అధికారులకు కీలక పోస్టింగ్‌లు ఇవ్వడం లేదన్న విమర్శలకు కూడా చెక్ పెట్టాలన్న ఆలోచనలో రేవంత్ అండ్ టీం కసరత్తు చేస్తోందట. మరికొన్ని శాఖల్లో మంత్రులకు, ఐఏఎస్‌ల మధ్య జరుగుతున్న పంచాయతీలకు చెక్ పెట్టేలా షఫ్లింగ్ చేయనున్నారని తెలుస్తోంది.త్వరలో రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల సమూల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నారన్న టాక్ నడుస్తోంది. కేవలం బదిలీలు అంటే ఒకరిని తీసి మరొకరిని పెట్టడం కాదు..పూర్తిగా ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కసరత్తు జరుగుతోందని అంటున్నారు. ముఖ్యంగా..సీనియర్, జూనియర్ల కోల్డ్ వార్, కన్ఫర్డ్ ఐఏఎస్, ఐఏఎస్‌ల మధ్య ఇగో క్లాషెస్‌కు ఫుల్ స్టాప్ పెట్టేలా ఎక్సర్ సైజ్ చేస్తోందట సర్కార్.కీలకమైన పోస్టుల కోసం జరుగుతున్న పోటీకి బ్రేక్స్ వేసి..ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలి? ఎవరి సీనియారిటీకి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేది ఒక పద్ధతి ప్రకారం జరగాలని రేవంత్ రెడ్డి క్లియర్ కట్ డైరెక్షన్స్ ఇచ్చారట. దీనిలో భాగంగా..రేవంత్ మార్క్ అడ్మినిస్ట్రేటివ్ రీషఫ్లింగ్‌తో న్యూటీమ్ రెడీ అవుతుందని టాక్. ఈ సారి జరిగే ఐఏఎస్‌ల బదిలీల్లో..అధికారుల లాబీయింగ్‌కు చెక్ పెట్టి..ఫెర్మామెన్స్, లాయల్టీ, ఎఫిషియన్సీకి పెద్దపీట వేయనున్నారట. ఇప్పటివరకు పనితీరు బాగా కనబరిచిన అధికారులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నది సీఎం ఆలోచన అంటున్నారు. మొత్తానికి రేవంత్ రెడ్డి తన మార్క్ మార్పులతో పర్ఫెక్ట్ టీమ్‌ను సెట్ చేసుకునే పనిలో బిజీగా ఉన్నారట. తన స్పీడ్‌కు అనుగుణంగా..క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులను ఎంపిక చేయనున్నారట. రేవంత్ మార్క్ ఐఏఎస్ టీమ్ ఎలా ఉండనుందనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# నిలిచిన ప్రగతి రథ చక్రం..

### - డిపోలకే పరిమితమైన 6000 బస్సులు
### - 60 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం



**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు బుధవారం సమ్మె బాట పట్టారు. ప్రభుత్వంతో నిర్వహించిన చర్చలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, మంగళవారం అర్ధరాత్రి నుంచే కార్మికులు తమ విధులను బహిష్కరించారు. ఈ సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ డిపోల్లో ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పలు జిల్లాల్లో బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పరిస్థితిని అదుపులో ఉంచడానికి ప్రభుత్వం అన్ని ప్రధాన బస్ డిపోల వద్ద భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది.ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల తెలంగాణ ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, ఉద్యోగులందరూ సమ్మె ఆలోచన విరమించి విధులకు హాజరుకావాలని సంస్థ ంఉఖీఅ ఎండీ వై. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల డిమాండ్లపై సమగ్రంగా చర్చించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఐఏఎస్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ కమిటీ ఇప్పటికే మంగళవారం కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన వివరించారు.కార్మికులు లేవనెత్తిన డిమాండ్లలో కొన్ని ఆర్థికపరమైనవి, సాంకేతిక చిక్కులతో కూడిన అంశాలు ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలను అన్వేషించడానికి ప్రభుత్వానికి కనీసం 4 వారాల సమయం అవసరమని నాగిరెడ్డి పేర్కొన్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున, ప్రభుత్వం కోరిన గడువుకు సహకరించాలని ఆయన కోరారు.అయితే కొన్ని సంఘాలు వాస్తవాలను పక్కనబెట్టి, సమ్మె పేరుతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడి ప్రయాణించే దినసరి కూలీలు, సామాన్య ప్రజలు మరియు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని ఆయన హితవు పలికారు. సంస్థ ప్రయోజనాలను, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, కార్మికులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా విధుల్లో పాల్గొనాలని ఎండి నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

**ఆర్టీసీ సమ్మె.. కార్మికులు ఏం డిమాండ్ చేస్తున్నారు**

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చింది. ఈ సమ్మెలో కార్మికుల ప్రధాన డిమాండ్ ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయడం. సంస్థను కేవలం ఒక కార్పొరేషన్‌గా కాకుండా ప్రభుత్వ శాఖగా గుర్తించి, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. దీనితో పాటు 2021 నుండి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరుతున్నారు. ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, సంస్థే నేరుగా కొత్త బస్సులను కొనుగోలు చేయాలని జేఏసీ స్పష్టం చేస్తోంది.సమ్మెను అడ్డుకునేందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలం కాలేదు. ప్రభుత్వం జీవో నంబర్ 66 ద్వారా ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, జేఏసీ నాయకులు దానిని ససేమిరా తిరస్కరించారు. కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, తమ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని జేఏసీ చైర్మన్ ప్రకటించడంతో సమ్మె అనివార్యమైంది.ఈ సమ్మె ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులపై పడనుంది. దాదాపు 6,000 బస్సులు డిపోలకే పరిమితం కావడంతో హైదరాబాద్ సిటీ బస్సులతో పాటు జిల్లాలకు వెళ్లే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిలిచిపోనున్నాయి. నిత్యం ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. చివరకు ఎయిర్‌పోర్ట్ పుష్పక్ సర్వీసులు కూడా నిలిచిపోవడంతో విమాన ప్రయాణికులకు సైతం కష్టాలు మొదలయ్యాయి.ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ప్రైవేట్ వాహనాలు, పాఠశాల బస్సులను తాత్కాలికంగా ప్రయాణికుల కోసం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల సహాయంతో కొన్ని బస్సులను నడపాలని ప్రభుత్వం భావిస్తోంది.



### ఘనంగా ప్రారంభమైన

## శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు






**బ్రహ్మంగారిమఠం సూర్య వాస్తవం:** భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. గురువారం ఉదయం సుప్రభాత అర్చనలు, శేష వాహనో త్సవం, హరికథ కాలక్షేపం, నిర్వహించారు. ఈనెల 26న ఆదివారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి సజీవ సమాధినిష్ట వహించిన పవిత్ర సుధీనం సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకునేందుకు అన్ని రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తారు. దర్శనానికి వచ్చే భక్తులకు క్యూ లైన్, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దీక్షాపరులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అలాగే క్యూలైన్లో మంచినీరు ,మజ్జిగ పంపిణీ చేయాలని వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములు వారు మేనేజర్ ఈశ్వరయ్య ఆచారికి ఆదేశించారు. సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్లు, కళ్యాణ కట్ట, విశ్రాంతి భవనం పర్యవేక్షించారు. అలాగే పరిసర ప్రాంతాలని శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.

## అంగరంగ వైభవంగా వాసవీమాత జయంతి వేడుకలు





**ఉరవకొండ - సూర్య వాస్తవం:** బెళుగుప్ప మండల కేంద్రంలో వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా ఆర్యవైశ్య కులదేవత అయిన వాసవిమాత జయంతి వేడుకలను బెలుగుప్ప ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వాహించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలై తరువాత 108 లీటర్ల పాలతో అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. తదుపరి సాంప్రదాయబద్ధంగా వస్తున్న ఆచారం ప్రకారం బెలుగుప్ప లక్ష్మీ బజార్ నందు గల లక్ష్మీనారాయణ స్వామి ఇంటి నుండి హంస, ప్రత్యూషలు అమ్మవారి కలశాలను ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో, మేళ తాళాలతో స్థానిక నగరేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైయున్న ఆర్యవైశ్య కులదేవత వాసవి దేవి సన్నిధి వరకు తీసుకువెళ్లడం జరిగింది పురోహితులు అమ్మవారికి మంగళహారతి ఇచ్చారు భక్తులు మొక్కలు చెల్లించుకొని . తీర్థ ప్రసాదాలు స్వీకరించారు . సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై మేళ తాళాలు, షేరి డ్రమ్స్ నడుమ వాసవి దేవి వెండిరథాన్ని బెలుగుప్ప మండల కేంద్రంలోని పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు గ్రామస్తులు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తును పణంగా పెట్టొద్దని సూచన

### క్రికెట్ బెట్టింగ్‌లపై ఎస్సై నాగమధు హెచ్చరిక



**కణేకల్ - సూర్య వాస్తవం:** ఇటీవలి కాలంలో యువత ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు ఆకర్షితులవుతూ తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని కణేకల్ ఎస్సై నాగమధు తెలిపారు. తల్లిదండ్రులకు తెలియకుండా కొంతమంది యువకులు బెట్టింగ్‌లలో పాల్గొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రికెట్ మ్యాచ్‌ల సమయంలో ఆన్లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లు విపరీతంగా పెరుగుతున్నాయని , ముఖ్యంగా యువత వీటి బారిన పడుతున్నారని చెప్పారు. బెట్టింగ్ పూర్తిగా చట్టవిరుద్ధమని, ఇందులో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే, తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్లైన్ కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. అక్రమ సంపాదన ఆశతో జీవితాలను పణంగా పెట్టొద్దని, కష్టపడి సంపాదించినదే స్థిరమైనదని ఎస్సై నాగమధు పేర్కొన్నారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ సమాజంలో శాంతి భద్రతలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





### అర్హులందరూ ప్రభుత్వ పథకాలను

# సద్వినియోగం చేసుకోవాలి..!

### జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



**పామిడి- సూర్య వాస్తవం:** అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. గురువారం సాయంత్రం పామిడి లోని అంబేద్కర్ ఎస్సీ కాలనీలో పీఎం సూర్య ఘర్ ముత్తు బిసిలు యువజన కింద మంజూరైన సోలార్ ప్యానల్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు ఇళ్లను సందర్శించి సోలార్ ప్యానల్ ఏర్పాటు అనంతరం లబ్ధిదారుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి అనే మహిళ జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్న నేపథ్యంలో తన ఇంటి పై భాగంలో సోలార్ ఏర్పాటు చేసుకున్నామని ప్రస్తుతం ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం పట్ల సంతోషంగా ఉన్నావని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా 2 కె వి సోలార్ ప్యానల్ ను అమర్చడం జరుగుతుందని తద్వారా రోజుకు 8 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. అర్హులందరూ ఇలాంటి ప్రభుత్వ పథకాలను సద్వినం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కాలనీలో ఉన్న చిన్నారులతో కాసేపు ముచ్చటిస్తూ బాగా చదువుకోవాలని ప్రస్తుత ఎండాకాలంలో ఇంటి వద్దనే ఉండాలని వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం పామిడి మండలంలోని సొరకాయల పేట గ్రామంలో యువ రైతు భార్గవ్ పొలంలో డ్రోన్ ద్వారా మందు పిచికారిని కలెక్టర్ పరిశీలించారు. డ్రోన్ వినియోగంపై యువరైతు భార్గవ్తో పలు విషయాలపై ఆరా తీశారు. డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు మందును పిచికారి చేయవచ్చునని ఉద్యాన పంటలు పండ్ల మొక్కలు వరి పేర్లకు సులభతరంగా ఇది ఎంతగానో దోహదపడు తుందన్నారు. అనంతరం రైతు భార్గవ్ మాట్లాడుతూ 3 ట్యాంకుల మందును 2 ఎకరాల వరకు పిచికారి చేసుకునే అవకాశం ఉంటుందని డ్రోన్ విలువ సుమారు రూ. 9. 81 లక్ష దాకా అవుతుందని మందు పిచికారి చేసే పొలాల్లో విద్యుత్ స్తంభాలు తీగలు అడ్డువస్తే అలారం వస్తుందన్నారు. తన పొలంలో పిచికారి ప్రక్రియ పూర్తవగానే ఇతర రైతుల పొలాల్లో మందును పిచికారి చేస్తామన్నారు. తాను బీటెక్ వరకు చదివానని కొన్ని రోజులు సాఫ్ట్వేర్ రంగంలో కూడా ఉద్యోగం చేసి ప్రస్తుతం వ్యవసాయంపై గల మక్కువతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో రైతు కృషి వికాస్ యోజన పథకం ద్వారా ఐదు మంది సభ్యులు ఒక గ్రూపుగా ఆంజనేయస్వామి రైతుమిత్ర సంఘం గా ఏర్పడి లబ్ధి పొందుతున్నానని తెలిపారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ఇవ్వగా లబ్ధిదారులు 20 శాతం చెల్లించాల్సి ఉంటుంద న్నారు. యువ రైతు తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లా కలెక్టర్ గ్రూపు సభ్యులను అభినందించారు. అనంతరం ఎద్దులపల్లి గ్రామంలో రైతులతో ముచ్చటించారు. చిన్న కారు రైతుల సంఘాల ద్వారా ట్రాక్టర్, వ్యవసాయ యాంత్రిక పరికరాల ప్రయోజనాల పై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇలాంటి పరికరాల ద్వారా అవకాశం ఉంటుందన్నారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యలను త్వరితగత పరిష్కరించాలని , పీహెచ్సీ లో వైద్య సిబ్బంది పనితీరుపై అక్కడున్న రైతులు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయగా దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గతంలో జరిగిన వాస్తవ స్థితిగతులను పరిశీలించి రైతుల సమస్యను పరిష్కరించాలని ,తాసిల్దార్ ను ఆదేశించారు. వైద్య అధికారులను మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం జల ధార జల హారతి పనులను గుర్తించాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేజోష్ణ, తాసిల్దార్ షర్మిల, ఏపీ ఎస్పీడీసీఎల్ ఈ ఈ, ఇరిగేషన్ డి ఈ బసవరాజు,ట్రాన్స్కో ఈ ఈ మధు వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్ డిప్యూటీ ఎంపీడీవో అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పై

# అసత్య ఆరోపణలు మానుకోండి

### - సీఐకి ఫిర్యాదు చేసిన కూటమి నాయకులు



**పామిడి -సూర్యవాస్తవం:** ఇటీవల ఏపీ 175 అనే యూట్యూబ్ ఛానల్ లో యూట్యూబ్ నిర్వహకుడు గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం పైన అసత్య ప్రచారాలు చేయడం జరిగింది . ఈ సందర్భంగా పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి పామిడి పట్టణ సిఐ కి ఏపీ 175 యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడిపైన ఫిర్యాదు చేయడం జరిగింది . ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా కేవలం 30 రోజుల్లోనే గెలిచి అదేవిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న గుమ్మనూరు జయరాం పైన అసత్య ప్రచారాలు చేయడం చాలా బాధాకరమని కార్యకర్తలు అందరూ అసహనంగా ఉన్నారు అంటూ యూట్యూబ్ నిర్వాకుడు మాట్లాడడం చాలా విచారకరమని తెలియజేశారు ఆ యూట్యూబ్ నిర్వాహకుడు గుంతకల్ నియోజకవర్గం లో ఎక్కడ సర్వే చేశారో ఏ ఏ కార్యకర్తలను కలిసి సర్వే చేశారు తెలపాలని డిమాండ్ చేశారు ఎందుకంటే అనునిత్యం కార్యకర్తల కోసం కష్టపడుతున్న తనయుడు యువనేత గుమ్మనూరు ఈశ్వర్ కార్యకర్తల కోసం అనునిత్యం కష్టపడుతున్నారని అలాంటి వారిపై అసత్య ఆరోపణలు చేయడం తగదని సూచించారు ఒక్కసారి మా వెంట గుంతకల్ నియోజకవర్గం అంతా తిరిగి సర్వే చేయాలని మీరు నికార్సైన కార్యకర్తలను ఎవరిని కలిశారని సర్వే చేశామని చెప్తున్నారని మండిపడ్డారు తెలుగుదేశం పార్టీ ముసుగులో వున్న వైసీపీ నాయకులను కలిసి సర్వే చేయడం మళ్ళీ ఇక్కడ పరిస్థితి బాగా లేదని చెప్పడం సిగ్గుచేటని ఈ సందర్భంగా మండిపడ్డారు..ఈ కార్యక్రమం లో పామిడి పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### పోషణ పక్వాడ ముగింపు కార్యక్రమం..

# చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన




**పామిడి,-సూర్య వాస్తవం:** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమాలు ఏప్రిల్ 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కొనసాగగా, బుధవారం ముగింపు కార్యక్రమం కాలవ గడ్డ 2 అంగన్వాడి కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రామలక్ష్మి మాట్లాడుతూ.. పిల్లల జీవితంలో తొలి రెండు సంవత్సరాలు అత్యంత కీలకమని, ఈ దశలోనే మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలిపారు. ఈ సమయంలో సరైన పోషకాహారం అందించకపోతే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. చిన్నారులను చక్కెర పదార్థాలు, ప్యాక్ చేసిన జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని తల్లులకు సూచించారు. అధికంగా చక్కెర వినియోగం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో పాటు జ్ఞాపకశక్తి, మేధో వికాసం దెబ్బతింటాయని వివరించారు. మన ఇంట్లో లభించే స్థానిక సాంప్రదాయ ఆహార పదార్థాలు పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, తల్లులు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు ప్రేమకుమారి, సుశీల, ఆయాలు కౌసర్, లక్ష్మీదేవి మరియు పలువురు తల్లులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ ని వివాహానికి ఆహ్వానించిన కూడేరు మండల పరిషత్ అధ్యక్షుడు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** పులివెందుల క్యాంప్ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వై. విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో.కూడేరు మండల పరిషత్ అధ్యక్షులు ఎం నారాయణ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లి మాజీ ముఖ్యమంత్రి, వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసి వివాహ పత్రికను అందజేశారు. 3వ తేదీన ఎమ్ వై ఆర్ కల్యాణ మండపం నందు జరగబోయే వివాహ మహోత్సవానికి హాజరై తమ కుమారుడు సాయి యశ్వంత్ రెడ్డి ఒ కీర్తన నూతన వధూవరులను ఆశీర్వధించాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో నారాయణ రెడ్డి గారి కుటుంబ సభ్యులు పాల్గొని జగన్మోహనరెడ్డి ఆశీస్సులు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన జగన్ గారు నూతన వధూవరులకు తన శుభాకాంక్షలు తెలియజేశారు.

## శంకరమంచి వారి ఉపనయన మహోత్సవంలో పాల్గొన్న తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లె శ్రీ భవాని నీలకంఠేశ్వర ఆలయానికి చెందిన బ్రహ్మశ్రీ శంకరమంచి సాయిప్రసాద్ శర్మ, నాగలతల కుమారుడు చిరంజీవి శంకరమంచి గురు సాయి శేషాద్రి శర్మ ఉపనయన సంస్కార మహోత్సవము గండి క్షేత్రంలోని శ్రీ వాసవి నిత్యాన్నదాన సత్రం నందు శాస్త్రోక్తంగా, వైభవంగా జరిగింది.రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నామా వినయ్, విజయ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని వటువు శేషాద్రి శర్మను ఆశీర్వదించారు.

## ఇంటి స్థలాలు పట్టాలు, స్మశానవాటిక స్థలాల అభివృద్ధి, కేటాయింపు కు కృషి చేయండి

### ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ






**శింగనమల - సూర్య వాస్తవం:** అనంతపురం నగరంలోని సింగనమల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ 6 మండలాల తహశీల్దార్లు, హౌసింగ్ డీ ఈ రామ్మూర్తి ,నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఆర్డీఓ కేసవ నాయుడు తో పాటు కలిసి నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ హౌసింగ్ స్కీం కు సంబంధించిన ఇంటి పట్టాలు మంజూరు, పెండింగ్ లో ఉన్న ఇంటి పట్టాలు పై చర్చించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని వివిధ కాలనీలలో మంజూరు చేయాల్సిన ఇంటి నివేశన పట్టాలు గురించి చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గ పరిధిలో ఎస్సి ల స్మశానవాటికల అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. స్మశానవాటికల కు స్థలాల కేటాయింపుకు చర్యలు చేపట్టాలని అలాగే నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఇచ్చిన రెవెన్యూ సమస్యలు పై పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీపేర్కొన్నారు.

### జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా

## నేడు వేంపల్లె లో గ్రామసభ

### పంచాయతీ కార్యదర్శి ఏమిరెడ్డి నాగభూషణం రెడ్డి.



**వేంపల్లె - సూర్య వాస్తవం:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించు కొని నేడు 24వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ అభివృద్ధి అధికారి ఏమిరెడ్డి నాగభూషణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభకు వేంపల్లి గ్రామానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు హాజరై, గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని, అవసరమైన తీర్మానాలను ఆమోదించాలని ఆయన కోరారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, అందరూ ఈ గ్రామసభలో పాల్గొని గ్రామ ప్రగతికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాన్వకేషన్ కార్యక్రమంలో పాల్గొన్న తులసి రెడ్డి





**వేంపల్లె సూర్య వాస్తవం:** వేంపల్లె నారాయణ విద్యాసంస్థలో గురువారం కాన్వకేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ అన్ని సంపదలలేకల్లా విద్యా సంపద ప్రధానమైనదని,ఆ సంపదను తమ బిడ్డలకు అందించవలసిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందని అన్నారు.విద్యాసంస్థల యాజమా న్యాలు, ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన, సంస్కారవంతమైన,నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని అన్నారు. మానవ జీవితంలో విద్యార్థి దశ స్వర్ణ యుగము లాంటిదని,ఈ దశను ఏ విద్యార్థి అయితే సద్వినియోగం చేసుకుంటాడో అతడు కచ్చితంగా జీవితంలో రాణిస్తాడని తులసి రెడ్డి అన్నారు. వేంపల్లి లో ఉన్న నారాయణ విద్యాసంస్థ ఆహ్లాదకరమైన వాతావరణంలో, గురుకుల విద్యా బోధన పద్ధతిలో, క్రమశిక్షణతో కూడిన, సంస్కారవంతమైన,నైతిక విలువల తో కూడిన విద్యను విద్యార్థులకు అందించడం హర్షణీయ మన్నారు. శుక్రవారం నుండి 50 రోజులపాటు పాఠశాల లకు వేసవి సెలవులు ఉంటాయని,ఈ వేసవి సెలవుల్లో కూడా విద్యార్థులు ప్రకృతి నుండి విద్యను అభ్యసించాలని తులసిరెడ్డి ఉద్బోధించారు. సూర్యుడు,చంద్రుడు, నక్షత్రాలు, ఆకాశము,భూమి, జంతువులు, పక్షులు,ఇలా ప్రకృతి లో ప్రతి ఒక్కటీ ఒక ఉపాధ్యాయుని తో సమానమని, వీటి నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చునని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటరమణారెడ్డి, విద్యాసంస్థల కరెస్పాండెంట్ కొట్టె నారాయణరెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,,నామా వినయ్, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### పులివెందుల ఎత్తిపోతల పథకాలపై

# అవినాష్ రెడ్డి అల్టిమేటం



## గురువారం లోపు మోటర్లు ఆడాల్సిందే సొంత ఖర్చుతో రిపేర్ చేస్తామన్నా పర్మిషన్ లేదనడం చిల్లర రాజకీయం

## ఎంపీ అవినాష్ రెడ్డి

**పులివెందుల అర్బన్ - సూర్య వాస్తవం:** నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాల నిర్వహణలో కూటమి ప్రభుత్వ వైఫల్యంపై ఎంపీ అవినాష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ అవినాష్ రెడ్డి,సతీష్ కుమార్ రెడ్డి రైతులతో కలిసి నీటిపారుదల శాఖ అధికారులను కలిశారు. లింగాల, వేముల మండలాల్లో ఎత్తిపోతల పథకాలు అధ్వానంగా ఉన్నాయని, నిర్వహణ లోపం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీబీఆర్ రిజర్వాయర్‌లో 10 టీఎంసీ ల నీరు ఉన్నప్పటికీ,మోటర్ల రిపేర్లు చేయించకపోవడం వల్ల పంటలకు నీరు అందడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.మేము సొంత ఖర్చుతో రిపేర్ చేస్తామన్నా పర్మిషన్ లేదనడం చిల్లర రాజకీయం అని ఎంపీ విమర్శించారు.రైతుల విషయంలో మానవత్వంతో ఆలోచించాలని కోరారు.



వెలిదండ్ల కెనాల్, కుంట, తాతిరెడ్డిపల్లె వద్ద మోటర్లను వచ్చే గురువారం లోపు పని చేసేలా చూడాలని,లేనిపక్షంలో మే 1న రైతులతో కలిసి భారీ ఎత్తున ఆందోళన చేస్తామని అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. కూటమి ప్రభుత్వం నియోజక వర్గంలో రాజకీయాలు పక్కన పెట్టి, రైతులకు తక్షణమే నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల వేముల మండల నాయకులు మరియు రైతులు భారీగా పాల్గొన్నారు.

# సాగునీటి కొరతతో రైతులు విలవిల

## - 500 చీనీ చెట్లను జేసీబి ద్వారా తొలగించిన జడ్పిటిసి శివప్రసాద్ రెడ్డి

**చక్రాయిపేట - సూర్య వాస్తవం:**

చక్రాయపేట లో తీవ్ర సాగునీటి ఎద్దడి నెలకొందని చక్రాయపేట జడ్పిటిసి తాటిగుట్ల శివప్రసాద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని పంచాయతీల లోని చెరువులు నీరు లేక ఎండిపోయాయని అన్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లలో నీటి మట్టం తగ్గుముఖం పట్టిందన్నారు. దీంతో సాగునీటి సమస్య తీవ్రంగా నెలకొందని తెలిపారు. మామిడి చెట్లు, చీని చెట్లు తదితర పంటలకు సాగునీరు అందక చెట్లు ఎండిపోతున్నాయని అన్నారు. కొన్ని రోజులుగా కొందరు రైతులు వేలకు వేలు డబ్బులు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినప్పటికి, ఆ తర్వాత ట్యాంకర్ల ద్వారా కూడా నీరు లేక చెట్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. వెలిగల్లు నీళ్లు వస్తే బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని ఆశాభావంతో ఉన్నప్పటికి ఆ ఆశ అడియాసకు చేరుకుంది. దీంతో సాగునీరు లేకపోవడంతో తన కున్న 5 ఎకరాల్లో వేసిన 500 చీనీ చెట్లను జేసీబి ద్వారా తొలగించినట్లు జడ్పీటీసీ శివప్రసాద్ రెడ్డి తెలిపారు.



మండలంలో కొందరు రైతులు సాగునీరు లేక మామిడి చెట్లు, చీనీ చెట్లు, నిమ్మ చెట్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు పై దృష్టి సారించి మండలం లోని అన్ని చెరువు లకు వెలిగల్లు నీళ్లు నింపాలని కోరారు. ఈ విషయం పై కడప జడ్పీ సమావేశంలో కలెక్టర్ దృష్టికి, అధికారుల దృష్టికి గతంలో తీసుకెళ్లి నట్లు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి చక్రాయపేట మండలంలో సాగునీటి సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని జడ్పిటిసి తాటిగుట్ల శివప్రసాద్ రెడ్డి కోరారు.

# మహిళల సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యత

## - మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి ఉపేక్షలు ఉండవు - జిల్లా ఎస్పీ పి.జగదీష్






**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలోని గోవిందరాజులు కళ్యాణ మండపంలో ఈరోజు మహిళలు మరియు చిన్నారుల భద్రతపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ పి. జగదీష్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... సమాజంలో పెరుగుతున్న వివిధ నేరాల నేపథ్యంలో మహిళలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళల భద్రతకు సంబంధించి ప్రభుత్వం మరియు పోలీసుశాఖలు అమలు చేస్తున్న పలు కీలక సేవలను పరిచయం చేశారు. ముఖ్యంగా శక్తి యాప్ మరియు స్త్రీ రక్ష పోర్టల్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం పొందే విధానాన్ని వివరించారు. ఈ యాప్‌లు మహిళలకు రక్షణగా నిలుస్తాయని, ప్రతి మహిళ వీటిని వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా.... ప్రేమ వివాహాల పేరుతో జరిగే మోసాలు, బాల్య వివాహాల దుష్ప్రభావాలు, మరియు పోక్సో చట్టం గురించి సవివరంగా అవగాహన కల్పించారు. చిన్నారులపై జరిగే నేరాలకు ఈ చట్టం కఠినంగా అమలవుతుందని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు.సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో డిజిటల్ అరెస్ట్ మోసాలు, లోన్ యాప్ మోసాలు వంటి అంశాలపై కూడా ఎస్పీ గారు వివరించారు. గత ఏడాది జిల్లాలో అన్ని రకాల చోరీలలో రూ. 5 కోట్లు సొత్తులు పోగొట్టుకోగా అదే సైబర్ నేరాలలో రూ. 61 కోట్లు పోగొట్టుకోవడం చూస్తే సైబర్ నేరస్తుల మోసాలు ఎలా జరుగుతున్నాయో అవగతమౌతోందన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, మరియు యాప్‌లకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గంజాయి, తదితర మాదక ద్రవ్యాల కట్టడికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. గంజాయి వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణా, సాగు లు సమాచారం తెలిస్తే ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు చేరవేయాలన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ... మహిళా భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా ధైర్యంగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు గురిచేసినా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అంతకు మునుపు... జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పోలీసులు, స్థానికులు, తదితరులు బైకు ర్యాలీ నిర్వహించారు. అర్బన్ పోలీసు స్టేషన్ నుండీ వాల్మీకి సర్కిల్ , టీ సర్కిల్ ల మీదుగా గోవిందరాజుల ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవిబాబు, మహబూబ్ బాషా, పలువురు సి.ఐ లు, ఎస్సైలు మరియు స్థానిక ప్రజలు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, మరియు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అన్ని వృత్తులలోకెల్లా ఉత్తమమైనది ఉపాధ్యాయ వృత్తి

## - ఎస్టియు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి



**రాయచోటి - సూర్య వాస్తవం:** ఈనెల 30 తేదీన రిటైర్డ్ కాబోతున్న మోటకట్ల (గొర్లపల్లి ) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం విజయలక్ష్మిని ఆమె పాఠశాలకు వెళ్లి ఎస్ టి యు సంబేపల్లి మండల శాఖ ఘనం నాయకులు,సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా హాజరైన ఎస్టియు జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి మాట్లాడుతూ విశ్వంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి చాలా ఉత్తమమైనదని, అందుకే తల్లి తండ్రి తర్వాత మూడో స్థానాన్ని గురువుకి ఇచ్చారని అలాంటి గురువృత్తిలో పనిచేసి రిటైర్డ్ కాబోతున్న విజయలక్ష్మి అదృష్టవంతురాలని అన్నారు, ఎంతోమంది పేద విద్యార్థులకు చదువు నేర్పించడంతోపాటు వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది నిజజీవితంలో ఉన్నత స్థాయికి చేర్చడంలో తోడ్పాటును, సహాయ సహకారాలను అందించడం హర్షించదగ్గ విషయమని ఆయన చెప్పారు. అలాంటి వృత్తి నుండి పాఠశాలలో పనిచేసే చివరిదినం కావడం కొంత బాధాకరమైన వృత్తిలో చేరినప్పుడే పదవి విరమణ రాసి ఉంటుందని ఆయన అన్నారు. అవసరం రాష్ట్ర నాయకులు వై రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి వలన ఉపాధ్యాయ వృత్తికే వన్నె వచ్చిందని, విద్య తో పాటు యోగా, కరాటి, లాంటి విద్యలను అందిస్తూ వారిలో మానసిక, ధైర్య, ఆరోగ్యాలను లాంటివి విద్యార్థులలో పెంపొందించడం గొప్ప విషయం అన్నారు. అనంతరం మండల ఎస్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర రెడ్డి, డివిజనల్ కన్వీనర్ మురళి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు మంగే నాయక్, రాజారెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగరాజా చారి, గంగిరెడ్డి, నాఎ దామోదర్ రెడ్డి, పాపిరెడ్డి,మండల గౌరవ అధ్యక్షులు వెంకటయ్య ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు రాజేంద్ర శరణయ్య, మండల సిపిఎస్ కన్వీనర్ నాగరాజా, కో కన్వీనర్ రమేష్, ఎంటిఎస్ కన్వీనర్ సురేంద్రారెడ్డి ఉపాధ్యాయినిలు సుజాత, అపర్ణ సుమలత తదితరులు పాల్గొన్నారు.

# పామిడి సీహెచ్‌సీలో అరుదైన శస్త్రచికిత్స

- 12 ఏళ్ల బాలుడికి వెరికోసెల్ ఆపరేషన్ విజయవంతం
- వైద్య బృందం ప్రతిభకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు



**పామిడి -సూర్య వాస్తవం:** పామిడిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిహెచ్ సి వైద్యులు మరోసారి తమ వృత్తి నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు. 12 ఏళ్ల అక్బర్ వలి అనే బాలుడికి 'వెరికోసెల్' (వారికాసులె ) సమస్యకు సంబంధించిన క్లిష్టమైన శస్త్రచికిత్సను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది.?వైద్య బృందం ప్రతిభ: ఈ శస్త్రచికిత్సను సర్జన్ డాక్టర్ కమలాధర్ సమర్థవంతంగా నిర్వహించారు. ఈ ప్రక్రియలో అనస్థీషియా విభాగం నుండి డాక్టర్ వై.ఎస్. రాఘవేంద్ర రెడ్డిగారు, మరియు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ కుమార్, కీలక పర్యవేక్షణ చేశారు. ఆపరేషన్ థియేటర్‌లో హెడ్ నర్స్ శివకుమారి, ఓటీ అసిస్టెంట్ వి. అంజినప్ప మరియు పీజీ వైద్యులు డాక్టర్ సాయి కృపాంజలి సమన్వయంతో పనిచేసి శస్త్రచికిత్స విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు.?హెచ్డీస్ కమిటీ మరియు స్థానికుల ప్రశంసలు ఈ సందర్భంగా హెచ్‌డీఎస్ (హెచ్డీస్ ) కమిటీ మెంబర్ రాజగోపాల్ ఆసుపత్రిని సందర్శించి, విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసిన వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.?సాధారణంగా ఇటువంటి శస్త్రచికిత్సల కోసం పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సి ఉంటుందని, అయితే పామిడి సీహెచ్‌సీలో ఇంతటి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం పట్ల స్థానికులు, బాలుడి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, కమిటీ సభ్యులు మరియు సిబ్బంది చూపిస్తున్న శ్రద్ధ మరియు అంకితభావం అభినందనీయమని పలువురు కొనియాడారు.?ఆపరేషన్ అనంతరం బాలుడు కోలుకుంటున్నారని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు.

# ఇప్పట్ల ఎస్సీ కాలనీలో నీటి కష్టాలు తీర్చిన బీటెక్ రవి

## - ప్రజా సమస్యపై తక్షణ స్పందన..





**లింగాల సూర్య వాస్తవం:** లింగాల మండలం ఇప్పట్ల గ్రామం ఎస్సీ కాలనీ వాసుల తాగునీటి కష్టాలకు తక్షణ పరిష్కారం లభించింది. గత కొంతకాలంగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల విన్నపంపై వెంటనే స్పందించిన బీటెక్ రవి , యుద్ధ ప్రాతిపదికన అక్కడ కొత్త బోరు వేయించి నీటి సౌకర్యాన్ని కల్పించారు. తమ సమస్యను అడిగిన వెంటనే పరిష్కరించి అండగా నిలిచినందుకు ఎస్సీ కాలనీ వాసులు బీటెక్ రవి పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో వడగాలులపై అవగాహన



**పులివెందుల సూర్య వాస్తవం:** పులివెందుల నగరిగుట్ట లోని ఆది ఆంధ్ర క్రిస్టియన్ కాలనీలో గల ఎంపీపీ స్కూల్ నందు "వడగాలులు–తీసుకోవలసిన జాగ్రత్తలు " పై శానిటేషన్ సెక్రటరీలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీ గౌస్ మాట్లాడుతూ పిల్లలు నీడలో మాత్రమే ఆడుకోవాలి అని, వదులుగా ఉండే దుస్తులను ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఎండలో బయటికి వెళ్ళకూడదనీ,వెళ్లేటప్పుడు గొడుగు , టోపీ వంటివి తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పాఠశాల హెడ్మాస్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు ఈ ఎండాకాలం లో మంచి నీరు ఎక్కువుగా తాగాలి అనీ మజ్జిగ, దోసకాయ,పుచ్చకాయ వంటి పదార్థాలలో తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం డేవిడ్ శ్యాంబాబు మాట్లాడుతూ ఎండలో తిరగడం వలన ఒంటిలో ఉన్న నీరు బయటకు ఎక్కువ పోయి డి హైడ్రేషన్ తో కండ్లు తిరిగే అవకాశం ఉంటుందని ఎక్కువ తలనొప్పి, కళ్ళు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సురేఖ, లక్ష్మీ నరసమ్మ,కమలాదేవి,రాజమ్మ శానిటేషన్ సెక్రటరీలు నరసింహారెడ్డి, డేవిడ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగీరథ మహర్షి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలు

- భగీరథ మహర్షి చూపిన బాట ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం
- వై నాగేశ్వరరావు యాదవ్, ఉమ్మడి కర్నూలు జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు





**కర్నూల్ -సూర్య వాస్తవం :** కర్నూలు లోని కలెక్టర్ కార్యాలయం నందు సునయన ఆడిటోరియం నందు శ్రీ భగీరథ మహర్షి రాష్ట్రస్థాయి జయంతోత్సవములు నిర్వహించడం జరిగినది. ఈ జయంతోత్సవాల్లో తెలుగుదేశం పార్టీ పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కే ఈ శ్యాం బాబు , ఎమ్మెల్యే గౌరు చరిత తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురా లు ఆదికృష్ణమ్మ ,డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ భగీరథ మహర్షి గారి సేవలను స్మరించుకుంటూ, ఆయన చేసిన తపస్సు, కృషి ద్వారా గంగానదిని భూమికి తీసుకువచ్చిన గొప్ప చరిత్ర. సమాజానికి సేవ చేయాలి అనే భావనతో ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయము బీ సీ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పర సాగర రాష్ట్ర చైర్మన్ ఆర్. వెంకటరమణప్ప,బొందిలి చైర్మన్ విక్రమ్ సింహ, ఉప్పర సాగర డైరెక్టర్ ఎల్.వి ప్రసాద్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళి, కర్నూలు జిల్లా ఉప్పర సాగర అధ్యక్షుడు గోపాల్, బీసీ సంఘల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# జూన్ బరిలోకి 'పెద్ది'...

రామ్‌చరణ్ నటిస్తున్న సినిమా 'పెద్ది' సినిమా ముచ్చటగా మూడోసారి మళ్లీ వాయిదాపడింది. ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడిన ఈ సినిమా ఈనెల 30న విడుదల కావాల్సివుంది. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకుని జూన్‌లో విడుదల చేస్తామని చిత్రయూనిట్ ప్రకటించింది. కథానాయికగా జాన్వీకపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ సినిమాను బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమాలో ఐటెం సాంగ్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో సంయుక్త మీనన్ నటించబోతున్నారనేది సమాచారం. గతంలో మృణాల్‌ఠాకూర్, మానస పేర్లు వినిపించాయి. తాజాగా సంయుక్తమీనన్‌ను ఖరారుచేసినట్లుగా సమాచారం.



# 'అగధ' సింహా

ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపొందుతున్న చిత్రం 'అగధ'. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ పతాకంపై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

– ఈ సినిమాలో కామాక్షి భాస్కర్ల కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో సింహా పాత్రలో నటిస్తున్న శ్రవణ్ రెడ్డి ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది.

# అంతర్జాతీయ ప్రేక్షకులు మెచ్చేలా

## 'ఏఏ 23'



అల్లు అర్జున్, లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో 'ఏఏ 23' చిత్రం తెరకెక్కబోతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర విషయాలు బయటకొచ్చాయి. ఈ చిత్రానికి రచయితగా పని చేస్తున్న రత్నకుమార్ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చిత్ర విశేషాలు చెప్పారు. 'ఏఏ 23ః ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్‌కు సిద్ధమవుతున్నాం. కచ్చితంగా ఇది అంతర్జాతీయ ఆడియన్స్‌కు నచ్చే కంటెంట్ ఉన్న సినిమా. ఈ చిత్రంలో నటీనటులు, వారి పాత్రలను బట్టి ఇలా చెప్పడం లేదు. గ్లోబల్ ఆడియన్స్‌ను మెప్పించే డెప్త్ ఉన్న కంటెంట్ ఈ కథలో ఉంది. కథా చర్చలు పూర్తయ్యాక అల్లు అర్జున్‌తో మాట్లాడటంతో మా టీమ్‌లో రెట్టింపు ఉత్సాహం పెరిగింది. మే రెండో వారం నుంచి మరింత వేగవంతంగా పనులు ముందుకెళ్తాయి' అని రత్నకుమార్ అన్నారు.

# 'వింటారా సరదాగా'లో

## శివాత్మిక

శివాత్మిక రాజశేఖర్, అశోక్ గల్లా సినిమా 'వింటారా సరదాగా' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కొద్ది రోజులుగా ఆమె ఈ సినిమాలో నటిస్తుందన్న వార్తలు విని పిస్తున్నాయి.

తాజాగా శివాత్మిక పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ ట్వీట్ చేసింది. హీరో అశోక్ గల్లా కూడా ఆమెకు విషెస్ చెప్పారు. సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌లో ఈ సినిమా రూపొందుతోంది.

ఉద్భవ్ రఘు ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. విజరు బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. శ్రీగౌరి ప్రియ అశోక్ గల్లా సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు.





# సంజు శాంసన్ శతకం

## ముంబయిపై చెన్నై సూపర్ కింగ్స్ ఘన విజయం

**ముంబయి:** టీమిండియా వికెట్ కీపర్ సంజూ శాంసన్ (101 నాటౌట్) అజేయ రాణించడంతో చెన్నై సూపర్‌కింగ్స్ 103 పరుగుల తేడాతో ముంబయిపై భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. వాంఖడే స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 207పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. అనంతరం ఆకెల్ హొసైన్, నూర్ అహ్మద్ బౌలింగ్‌లో చెలరేగడంతో ముంబయి జట్టు 19 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఈ సీజన్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ మూడో గెలుపుతో పాయింట్ల పట్టికలో పై పైకి ఎగబాకింది. టాస్ ఓడిన చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. హార్దిక్ వేసిన రెండో ఓవర్లో రుతురాజ్ గైక్వాడ్(22) రెండు ఫోర్లు, సిక్సర్‌తో రాణించాడు. మరో ఎండ్‌లో సంజూ శాంసన్(101నాటౌట్; 54బంతుల్లో 10ఫోర్లు, 6సిక్సర్లు) శతకంతో గర్జించాడు. చెన్నై స్కోర్ 32పరుగుల వద్ద తొలి వికెట్ పడింది. అనంతరం శాంట్నర్ ఓవర్లో వరసగా రెండు ఫోర్లు బాదిన సర్ఫరాజ్ ఖాన్ (15) అనూహ్యంగా నాలుగో బంతికి బౌల్డయ్యాడు. ఆ తర్వాత వచ్చిన శివం దూబే(5)ను ఘజన్‌ఫర్ బౌల్డ్ చేసి రెండో వికెట్ సాధించాడు. ముంబై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ వికెట్లు తీస్తున్నా శాంసన్ తడబడలేదు. డెవాల్డ్ బ్రెవిస్(21)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఉన్నంతసేపు దంచిన బ్రెవిస్‌కు అశ్వనీ కుమార్ చెక్ పెట్టాడు. ఒకదశలో చెన్నై 180 లోపే పరిమితమయ్యేలా కనిపించింది. కానీ, డెత్ ఓవర్లలో గేర్ మార్చిన సంజూ.. బుమ్రా ఓవర్లో ఫోర్, భగత్ ఓవర్లో తొలి బంతికి సిక్సర్‌తో తొంభైలోకి వచ్చాడు. అదే ఊపులో బంతిని రెండుసార్లు స్టాండ్స్‌లోకి పంపిన శాంసన్ సెంచరీతో పాటు చెన్నై స్కోర్ రెండొందలు దాటించాడు. సంజూ విధ్వంసంతో చెన్నై నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. భారీ



ఛేదనలో ముంబయి టాపార్డర్ బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో 11 పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సూర్యకుమార్(36), తిలక్ వర్మ(37) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు కూడా విఫలం కావడంతో ముంబయి 104 పరుగులకే కుప్పకూలింది. చెన్నై బౌలర్ ఆకెల్ హొసైన్‌కు నాలుగు, నూర్ అహ్మద్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజు శాంసన్‌కు దక్కింది.

### మాత్రే స్థానంలో మధ్వాల్..

గాయం కారణంగా 2026 ఐపిఎల్‌కు దూరమైన చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ బ్యాటర్ ఆయుష్ మాత్రే స్థానంలో కీలక ఆటగాడికి చోటు దక్కింది. మూడో స్థానంలో అద్భుతంగా రాణించిన 18ఏళ్ల ఆయుశ్ మాత్రే టోర్నీకి దూరం కావడంతో అతడి స్థానంలో డెత్ ఓవర్ స్పెషలిస్ట్, యువ పేసర్ ఆకాశ్ మధ్వాల్‌కు చోటు కల్పించింది. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా సీఎస్కే యాజమాన్యం గురువారం వెల్లడించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో కాలి కండరాల నొప్పితో మైదానం వీడిన సంగతి తెలిసిందే. కుడి చేతివాటం పేసరైన మధ్వాల్‌కు సీఎస్కే రూ.30 లక్షలు చెల్లించనుంది. పద్దెనిమిదో సీజన్ వేలంలో రూ.1.20 కోట్లకు ఈ కుర్ర పేసర్‌ను రాజస్థాన్ రాయల్స్ దక్కించుకున్న విషయం తెలిసిందే.

# భారత జట్టు చరిత్ర తిరగరాసేనా..

## నేటినుంచి థామస్, ఉబర్ కప్ ఫైనల్స్

**హార్సెన్స్(డెన్మార్క్):** నేటినుంచి థామస్ మరియు ఉబర్ కప్ ఫైనల్స్ ప్రారంభం కానున్నాయి. శుక్రవారం జరిగే తొలి పోటీలో భారత పురుషుల జట్టు కెనడాతో తలపడనుంది. 27న ఆస్ట్రేలియాతో 29న చైనాతో తలపడనుంది. యువ ఆటగాళ్లతో కూడిన భారత పురుషుల జట్టులో ఆయుష్ శెట్టి ఫామ్‌లోకి రావడంతో మరింత పటిష్టంగా మారింది. దీంతో మరోసారి థామస్‌కప్ టైటిల్ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా భారత పురుషుల జట్టు బరిలోకి దిగుతోంది. ఇక మహిళల జట్టు శుక్రవారం జరిగే ఉబర్ కప్‌లో కొంత వెనుకబడి ఉన్నా.. సమీకరణలు కలిసొస్తే నాకౌట్‌కు చేరడం ఖాయం. నాలుగేళ్ల క్రితం కిదాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణరు సారథ్యంలోని భారతజట్టు డెన్మార్క్, మలేషియా, ఇండోనేషియాలను ఓడించి తొలిసారి టైటిల్‌ను కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. దీనికి ముందు జరిగిన టోర్నీలో క్వార్టర్‌ఫైనల్లో చైనా చేతిలో ఓడి తుదిపోరుకు దూరమైంది. కానీ ఇటీవలి కాలంలో ఆయుశ్‌శెట్టి ఫామ్‌లోకి రావడంతో టీమిండియా మరింత దుర్భేధ్యంగా తయారైంది. ఇక మహిళల విభాగంలో జరిగే ఉబర్ కప్ ఫైనల్స్‌లో పివి సింధు సారథ్యంలోని భారతజట్టు శుక్రవారం జరిగే తొలిపోరులో డెన్మార్క్‌తో, 25న ఉక్రెయిన్, 27న పటిష్ట చైనాతో తలపడనుంది.

నాకౌట్‌కు చేరాలంటే కనీసం రెండు జట్లపైన భారతజట్టు గెలవాల్సి ఉంది. మహిళలజట్టు యూరోపియన్ టీమ్ ఛాంపియన్ రన్నరప్ డెన్మార్క్, కాంస్య పతక విజేత ఉక్రెయిన్‌తోపాటు 16సార్లు ఛాంపియన్ చైనాను భారత మహిళలజట్టు ఓడించాలంటే సంచలనాలను నమోదు చేయాల్సిందే. తొలి సింగిల్స్‌లో సింధు గెలుపుపైనే మిగతా షట్లర్ల ఫలితాలు ఆధారపడి ఉన్నాయి. ఇటీవలికాలంలో సింధు ఆశించిస్థాయిలో ప్రదర్శన కనబర్చడం లేదు.



సూర్య వాస్తవం
Truth of News
http://www.suryavastavam.in

## వేసవి సెలవులలో శిల్పారామంలో సమ్మర్ క్యాంప్




శిల్పారామం పరిపాలనాధికారి

**పులివెందుల సూర్య వాస్తవం:** పులివెందుల శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా మే 1 తేదీ నుండి 31 వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని శిల్పారామం పరిపాలనాధికారి పేర్కొన్నారు. గురువారం పత్రికలకు అందించినటువంటి సమాచారం మేరకు సమ్మర్ క్యాంపులో భాగంగా చిన్న పిల్లలకు ఆర్ట్ మరియు డాన్స్ విభాగాలలో క్యాంపు నిర్వహిస్తున్నామని ఆసక్తి గలవారు మొబైల్ నెంబర్ 888 6652010 మరియు 9000258848 నంబర్లకు ఫోన్ చేసి వివరాలను కనుగొని తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.


పెళ్లకూరు మండలంలో సంగం డైరీ విస్తరణకు శంకుస్థాపన

## చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకు ఘన సన్మానం

### ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో కార్యక్రమం

### గోను బాబు చేతుల మీదుగా శాలువాలతో సత్కారం

### స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయన్న ఆశాభావం



**పెళ్లకూరు, సూర్య వాస్తవ:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పాలచ్చూరు సమీపంలోని మేనకూరు సెజ్‌లో సంగం డైరీ విస్తరణ పనులకు ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర, స్థానిక ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మరియు ఏఎంసీ డైరెక్టర్ గోను బాబు, చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రను శాలువాతో సన్మానించి అభినందించారు. విలేకరులతో మాట్లాడుతూ గోను బాబు తెలిపారు, మేనకూరు సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. సంగం డైరీ విస్తరణతో ఈ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని కొనియాడారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఉచిత మజ్జిగ పంపిణీ



**అనంతపురం - సూర్య వాస్తవం :** మండుటెండలలో దాహార్తిని తీర్చడానికి మరియు ఆరోగ్య ప్రయోజనాలను అందించడానికి శ్రీ వాసవి మాత జయంతి సందర్భంగా ధర్మకర్త శ్రీవారి సేవకులు ఆళ్లగడ్డ రాము ఆధ్వర్యంలో దాతలుచే ఉచిత మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని గత తొమ్మిది సంవత్సరాలుగా 3 రోజులలో నిర్వహిస్తున్నారని తెలిపారు. శుక్రవారం నుండి ఆదివారం వరకు నిర్వహించే ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని వాసవి మాత, శ్రీనివాసుని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు

### సెన్సస్-2027 శిక్షణ పూర్తి...


## మే 1 నుంచి ఇండ్ల గణన సర్వే ప్రారంభం



**కనేకల్ సూర్య వాస్తవం:** సెన్సస్-2027 కార్యక్రమంలో భాగంగా కనేకల్ మండలంలో నిర్వహించిన మూడో బ్యాచ్‌కు చెందిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది. ఇప్పటికే మొత్తం తొమ్మిది రోజులపాటు శిక్షణ పొందిన సచివాలయ సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించగా, వారు మే 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మొదటి దశలో భాగంగా ఇండ్ల గణన సర్వే చేపట్టనున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, జనాభా లెక్కల సర్వే దేశ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు కీలకమైనదని తెలిపారు. కనేకల్ మండలంలోని ప్రతి కుటుంబం సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించి సెన్సస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. శిక్షణా కార్యక్రమంలో ఎన్యూమరేటర్లకు సమగ్ర అవగాహన కల్పించిన ట్రైనర్లకు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయసింహా రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ విశ్వనాథ్, తహశీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజు, గ్రామ రెవెన్యూ అధికారి పవన్ కుమార్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### మాజీ ముఖ్యమంత్రి భాస్కర్ రావు భౌతిక కాయానికి

## నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఉరవకొండ జనసేన ఇంచార్జ్ గౌతమ్ కుమార్

**ఉరవకొండ - సూర్య వాస్తవం:** జనసేన పి ఏ సీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ తండ్రి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు నాదెండ్ల భాస్కర్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నాదెండ్ల మనోహర్ ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఉరవకొండ జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ 'గౌతమ్ కుమార్' ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఇంచార్జి చింతా సురేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాల్మీకి/బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, శ్రీశైలం నియోజకవర్గం రౌతు అశోక్ కుమార్, జనసేన ముఖ్యనాయకులు పాల్గొని వారి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

# పెళ్లకూరు మండలంలో దారుణం

## - వికలాంగుడిపై కత్తులతో దాడి,

## - ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స

- వికలాంగుడిపై కత్తులతో దాడి,
ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స
- ఎఫ్ఐఆర్ పేర్లు మార్పిడి ఆరోపణలు
- ఎస్ఐపై బాధిత కుటుంబం తీవ్ర విమర్శలు, ఎస్పీకి ఫిర్యాదు
- పగబట్టిన దాడి... ఏడు కత్తిపోట్లతో వికలాంగుడి ప్రాణాలపై పోరు
- ఆసుపత్రిలోనే రిపోర్ట్ రాసిన ఎస్ఐ...
ఒత్తిడితో సంతకం తీసుకున్నారన్న ఆరోపణ
- వీడియోలు ఉన్నా చర్యలు లేవు... ఎస్పీకి బాధిత కుటుంబం ఫిర్యాదు
- ప్రలోభాలకు లోనై కేసు మళ్లించారంటూ ఎస్ఐపై తీవ్ర విమర్శలు
- ప్రధాన నిందితులను కాపాడుతున్నారా? పోలీసులపై ప్రశ్నలు
- సమగ్ర విచారణకు డిమాండ్...
న్యాయం చేయాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి




**పెళ్లకూరు, సూర్య వాస్తవం:** పెళ్లకూరు మండలం అర్ధమాల గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వికలాంగుడు అర్ధమాల శంకరయ్యపై దుండగులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆయన తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాధితుడి కుమారుడు అర్ధమాల మోహన్ తెలిపిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో శంకరయ్య గ్రామ సమీపంలోని కల్వర్ట్ వద్ద తన భూమి వైపు వెళుతుండగా, అర్ధమాల హరినాథ్ మరియు వాటంబేటి చంద్రశేఖర్ దారి కాచుకుని వెనుక నుండి దాడి చేసినట్లు ఆరోపించారు. "మా నాయకుడు, ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేస్తావా" అంటూ బెదిరిస్తూ ఏకంగా 7 చోట్ల కత్తిపోట్లు పొడిచారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. దాడి అనంతరం శంకరయ్య అరుపులు విని స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న ఆయనను రక్షించి, వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి రిఫర్ చేయగా, ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు స్పృహ కోల్పోయే ముందు దాడికి పాల్పడిన వారి పేర్లు చెప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. ఆ సమయంలో తీసిన వీడియోలు, ఫోటోలు కూడా పోలీసులకు మరియు మీడియాకు అందించినట్లు సమాచారం. అయితే, కేసు నమోదు విషయంలో వివాదం నెలకొంది. పెళ్లకూరు సబ్ ఇన్‌స్పెక్టర్ బాధితుడు పేర్కొన్న ముఖ్య నిందితుల పేర్లు ఎఫ్ ఐ ఆర్ లో నమోదు చేయకుండా, ఒక్కరిపై మాత్రమే కేసు నమోదు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఆసుపత్రిలో విచారణ సమయంలో కుటుంబ సభ్యులను అనుమతించకుండా, బాధితుడి నుండి బలవంతంగా సంతకం తీసుకున్నారని మోహన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం తిరుపతి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి అసలు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి నిజానిజాలు వెలికితీయాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## బి.సి. గళం' విజయవంతం చేద్దాం

### వైస్సార్సీపీ పిలుపు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లాలో వెనుకబడిన తరగతుల (దీజ) హక్కుల సాధన కోసం మరియు వారి ఐక్యతను చాటిచెప్పడానికి నిర్వహిస్తున్న 'బి.సి. గళం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక నేతలు పిలుపునిచ్చారు.?నేడు జరిగిన ఒక కార్యక్రమంలో నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, 'బి.సి. గళం' కు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బి.సి.లందరూ ఏకతాటిపైకి వచ్చి తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని కోరారు.? బి.సి. కులాల మధ్య సమన్వయం మరియు ఐక్యతను పెంపొందించడం. రాజకీయంగా మరియు సామాజికంగా బి.సి.లకు దక్కాల్సిన వాటాను సాధించుకోవడం. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచడం. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్ పి అనంతవెంకట్రామిరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి సీపి వీరన్న, వైస్సార్సీపీ నాయకులు, బి.సి. నేతలు, కార్యకర్తలు మరియు మద్దతుదారులు భారీ సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



సెన్సస్-2027 శిక్షణ పూర్తి...

మే 1 నుంచి ఇండ్ల గణన సర్వే ప్రారంభం

**కనేకల్ - సూర్య వాస్తవం:** సెన్సస్-2027 కార్యక్రమంలో భాగంగా కనేకల్ మండలంలో నిర్వహించిన మూడో బ్యాచ్‌కు చెందిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం విజయవంతంగా ముగిసింది. ఇప్పటికే మొత్తం తొమ్మిది రోజులపాటు శిక్షణ పొందిన సచివాలయ సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించగా, వారు మే 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మొదటి దశలో భాగంగా ఇండ్ల గణన సర్వే చేపట్టనున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, జనాభా లెక్కల సర్వే దేశ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు కీలకమైనదని తెలిపారు. కనేకల్ మండలంలోని ప్రతి కుటుంబం సర్వే సిబ్బందికి సరైన సమాచారం అందించి సెన్సస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. శిక్షణా కార్యక్రమంలో ఎన్యూమరేటర్లకు సమగ్ర అవగాహన కల్పించిన ట్రైనర్లకు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయసింహా రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ విశ్వనాథ్, తహశీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజు, గ్రామ రెవెన్యూ అధికారి పవన్ కుమార్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

## - దివి నుంచి భువికి గంగను రప్పించిన మహనీయుడు భగీరథ మహర్షి...
## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ




**అనంతపురం – సూర్య వాస్తవం :** గురువారం నాడు అనంతపురం పట్టణంలో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడు కలను సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీ నారాయణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ హాజరయ్యారు.ముందుగా క్లాక్ టవర్ నుండి శ్రీకంఠం సర్కిల్ వరకు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేత కేక్ కట్ చేసి పంచిపెట్టారు. భగీరథుడి చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన పట్టుదలను, కృషిని గుర్తుచేస్తూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివి నుంచి భువికి గంగను రప్పించిన మహనీయునిగా భగీరథుని త్యాగాన్ని, కృషిని కొనియాడారు. శ్రీ భగీరథుని చరిత్ర పట్టుదల, త్యాగం, దీక్షతో అసాధ్యాన్ని సాధించగల సమర్థత గురించి ప్రజలకు బోధిస్తుందన్నారు. ఇలాంటి మహనీయుల జయంతులను జరుపుకోవడం ద్వారా యువతలో సాహసం, సేవ, సామాజిక దృష్టిని పెంచే వేదికగా ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సగర సంఘం నాయకులు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల పంపిణీ

**కదిరి – సూర్య వాస్తవం :** కదిరి,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీసీడీవో అనిత హాజరయ్యారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ లియాఖత్ అలీ మరియు వృత్తి విద్య సమన్వయకర్త నరేంద్ర పాల్గొని కార్యక్రమ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు వృత్తి విద్యకు సంబంధించిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రాక్టికల్ నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు భవిష్యత్తు ఉపాధి అవకాశాలకు దోహద పడతాయని ముఖ్య అతిథులు తెలిపారు. వృత్తి విద్య ఉపాధ్యాయులు లావణ్య, శివ ప్రసాద్ చేసిన సేవలను ముఖ్య అతిథులు ప్రత్యేకంగా ప్రశంసిస్తూ వారికి అభినందనలు తెలిపారు. విద్యార్థులను సమర్థంగా తీర్చిదిద్దడంలో వారి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో పాఠశాల సిబ్బంది అందరూ సహకరించారు. చివరగా అతిథులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పాలిసెట్--2026 నిర్వహణకు ఏర్పాట్లు

## ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శివ శంకర్



**సింహాద్రిపురం– సూర్య వాస్తవం :** రాష్ట్రస్థాయి పోటీ పరీక్ష అయిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్--2026) నిర్వహణకు పులివెందుల మరియు సింహాద్రిపురం పట్టణాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శివ శంకర్ తెలిపారు.ఏప్రిల్ 25న (శనివారం) జరగనున్న ఈ పరీక్షకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ (సింహాద్రిపురం) సమన్వయ కేంద్రం పర్యవేక్షణలో పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది సుమారు 1200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని పులివెందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల,అహోబిలాపురం, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింహాద్రిపురం మండలం నీడెళ్ళ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. పరీక్ష సమయం ఉదయం 11:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఉంటుందని విద్యార్థులను ఉదయం 10:00 గంటల నుండే కేంద్రాల్లోకి అనుమతిస్తారని, నిర్ణీత సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించ బడరు కావున విద్యార్థులు తమ హాల్ టికెట్లతో గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పులివెందుల మరియు సింహాద్రిపురం ప్రాంతాల్లోని 10వ తరగతి విద్యార్థుల కోసం తొలిసారిగా స్థానికంగానే ఈ రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని అధికారులు ఆకాంక్షించారు. పరీక్షల విజయవంతానికి ఇటీవల కలెక్టరేట్‌లో పోలీస్, ఏపీఎస్ఆర్టీసీ, విద్యుత్,వైద్య ఆరోగ్య మున్సిపల్ శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు.పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, రవాణా మరియు భద్రతా ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక టౌన్ అబ్జర్వర్లు,రెవెన్యూ బృందాలు మరియు జిల్లా విద్యాశాఖ అధికారులను నియమించినట్లు సమన్వయకర్త సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శివ శంకర్ తెలిపారు.

# భగీరథుని కృషి నేటి యువతకు ఆదర్శం



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తిలో శ్రీ సూర్యవంశం వడియా రా జుల సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వ హించారు.మహర్షి చిత్రపటానికి పూ లమాలలు వేసి నాయకులు నివాళు లర్పించారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన భగీరథుని కృషి నేటి యువత కు ఆదర్శమని చిరంజీవి,మారుతి ప్ర సాద్, వరదరాజులు,లక్ష్మీదేవి కొని యాడారు.భగీరథ ప్రయత్నం స్ఫూర్తితో లక్ష్యాలను సాధించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సం ఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# పండ్ల తోటలపై రైతులకు అవగాహన సదస్సు





**ఉరవకొండ – సూర్య వాస్తవం :** కూడేరు మండల కేంద్రంలో భగవతి ఫంక్షన్ హాల్ జరిగిన ?హ్యూమన్ అండ్ నేచురల్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ సొసైటీ (నూచీణూ) మరియు సే ట్రీస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'అగ్రోఫారెస్ట్రీ -- క్లైమేట్ ప్రూఫింగ్ ఫార్మ్ లైవ్‌లీహుడ్స్' ప్రోగ్రామ్ కింద ఈ సమావేశం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు మరియు ప్రాజెక్ట్ నిర్వహణ బృందం చురుగ్గా పాల్గొన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివరాం మాట్లాడుతూ కాలుష్యం పెరగడానికి మనం కూడా ఒక కారణం మన అవసరాల కోసం వాడుతున్న వాహనాల నుండి వస్తున్న పొగ మనం పీల్చే గాలిని కలుషితం చేస్తున్నాయి ఈ కాలుష్యం నుండి మనల్ని కాపాడేవి ఒక్కటే అవి చెట్లు అడవులను కాపాడుకోవాలి అనంతపురం జిల్లాలో ఎక్కడ చూసినా అడవులకు నిప్పు పెడుతున్నారు ఎవరో ఆకతాయిలు బీడీ సిగరెట్లు తాది కింద పడేయడం వలన అడవులు కాలిపోతున్నాయి దానివల్ల చిన్న చిన్న మొక్కలు ప్రాణులు పక్షులు వాటి గ్రుడ్లు కాలిపోతున్నాయి అందువల్ల ఎవరికి వారు అడవికి నిప్పు మానవాళికి ముప్పు అని తెలుసుకొని అడవులను కాపాడుకోగలిగితే వర్షాలు బాగా కురిసే బోర్లలో నీటిమట్టం పెరుగుతుంది ఈరోజు యల్లనూరు పుట్లూరు మండలాలలో 700 నుండి 1000 అడుగులలో బోర్లల్లో నీళ్లు పడుతున్నాయి మన జిల్లా దాటి మదనపల్లి చిత్తూరు అటు కోస్తాంధ్ర ఏరియాలలో ఎటువైపు చూసినా పచ్చని చెట్లు కొండలు కనబడుతున్నాయి మన ఏరియాలో మాత్రం ఎండిపోయిన చెట్లు కాలిపోయిన కొండలు దర్శనమిస్తున్నాయి అందువల్ల ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించుకోవాలి అలాగే రైతులు పొలాల గట్ల మీద ఎర్రచందనం శ్రీగంధం టేకు చెట్లు ఏవైనా పెంచుకోవచ్చు ఒక గంజాయి తప్ప ఎర్రచందనం చెట్లు పెంచుకోవడానికి రైతులకు ఎటువంటి పర్మిషన్ అవసరం లేదు అని వారి అపోహలు తొలగించారు. కానీ వాటిని అమ్ముకు నేటప్పుడు పర్మిషన్ తీసుకోవాలి. ఈమధ్య చింత చెట్లు బాగా తగ్గిపోతున్నాయి. ఇంతకుముందు అశోకుడు రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటించెను అని చదువుకున్నాము ఈమధ్య డెవలప్మెంట్ పేరుతో రోడ్లు విస్తరించడం వలన చెట్లను నరికేస్తున్నాము హిందూపురం మడకశిర ప్రాంతాల్లో మాత్రమే చింత చెట్టు కనబడుతున్నాయి ఆగ్రో ఫారెస్ట్రీ మరియు అటవీశాఖ తరఫున రైతులకు ఒక విషయాన్ని విన్నవించుకుంటున్నా మా అటవీశాఖ నర్సరీలో చింత చెట్లు పంపిణీ చేస్తున్నాము రైతులు వారి పొలాల దగ్గర రెండు లేక మూడు చెట్లు పెంచుకోవడం వలన అది మీ కుటుంబానికి ఉపయోగపడుతుంది అలాగే ఊరికి ఉపయోగపడుతుంది అన్నారు. నన్ను ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణస్వామికి రీజినల్ మేనేజర్ మనోహర్ కు ఇక్కడికి వచ్చిన రైతులకు నా ధన్యవాదాలు అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయరాం తెలియజేశారు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మాధవి రీజినల్ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ రైతులు కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని. రైతులకు ఇచ్చిన మొక్కలను పొలంలో పెట్టకుండా ఆలస్యం చేయడం వలన ఎవరైనా పొలంలోకి ఎంక్వైరి వస్తే సంస్థకు డబ్బులు వృధా అనుకుంటారు. అందువల్ల అటువంటి సమస్యలు రాకుండా చూడాలి.నీళ్ల డ్రమ్ములు ఇస్తే అవి పొలం దగ్గర కాకుండా ఇంటి దగ్గర పెట్టుకుంటున్నారు రైతుకి ఇచ్చిన 400మొక్కల్లో 10 చనిపోతే 160 రాసుకోమని చెబుతున్నారంట ఆలా చెప్పడం వలన ఈ ప్రాజెక్ట్ చేసి ఉపయోగం లేదని భావించే ప్రమాదముంది అందువల్ల చనిపోయిన మొక్కలని రీప్లేస్ చేస్తామని చెప్పారు.ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ ఈ సమావేశానికి 4 మండలాల పరిధిలోని 44 గ్రామాల నుండి సుమారు 235 మంది రైతులు హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. గత రెండేళ్లలో రైతులకు 3.20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు నారాయణస్వామి వెల్లడించారు. వచ్చే ఏడాదికి మరో లక్ష మొక్కల డిమాండ్ ఉందని గుర్తించామన్నారు.

రైతులకు లభించిన హామీలు సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకునేందుకు రైతులకు రక్షక తడుల సౌకర్యం కల్పిస్తామని సాగుకు అవసరమైన ముడి సరుకులు (ఇన్పుట్స్ సబ్సిడీ ) మనోహర్ సార్ మాట్లాడాలి అందజేస్తామని అన్నారు. వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు ప్రత్యేక శిక్షణ ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణస్వామి ఇచ్చారు. సాయిల్ అసిస్టెంట్ సుప్రజ మాట్లాడుతూ రైతులు మట్టి సేకరించే సమయంలో మూడు అడుగులు తవ్వి మట్టిని తీసుకురావాలని అప్పుడే మీరు పొలంలో ఎటువంటి పోషకాలు ఉన్నాయో తెలుస్తుంది అన్నారు. ఈ సమావేశం కేవలం చర్చలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులకు భరోసా కల్పించడంలో పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషించనుంది. ఈ కార్యక్రమం లో ప్రోగ్రాం మేనేజర్స్ పీరావళి ఉ కేశవ్, టెక్నికల్ అసోసియేట్స్ తేహరా, సాయి చరణ్,, సాయిల్ అసిస్టెంట్ సుప్రజ, క్షేత్ర స్థాయి సిబ్బంది నాగ లక్ష్మి, శివ శంకర్, భాగ్య, ఇతర ఫీల్డ్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

